18-6-76
60 పైసలు




ఆంధ్రసచిత్రవారపత్రిక

కొనండి

ఎవరెడి
జీవన్-సాథీ

ఇత్తడి టార్చి

యుగ యుగం వెలిగేది యుగ యుగం మన్నేది



జీవన్-సాథీ రిఫ్లెక్టర్

స్వచ్ఛమైన ఇత్తడిది—తెల్లగా తళతళలాడేది—కొంచెం కూడ—ఎప్పుడూ నల్లబడనిది అందుకే ఫోకస్‌లో ఏవిధమైన మచ్చలు నీడలు ఉండవు—మరియు కాంతిని కూడా చాలా ప్రకాశవంతంగా వెదజల్లుతుంది

వన్-సాథీయొక్క
ందరమైన దేహం:

ఖనరైన ఇత్తడి తొడుగు, విపై క్రోమియం పాలిష్, యొక్క మన్నికను గూర్చి నవసరం లేదు ప్రతిక్షణం నిముషం మీ చేతులలో మెరిసేది.

జీవన్-సాథీ స్విచ్:

ఇతర టార్చిల స్విచ్‌ల కంటె మూడింతలుగా మేలైనది మరియు మన్నికైనది ఎన్ని సార్లు కావాలన్నా నొక్కి వదలండి అయినాకూడ చెక్కు చెదరనిది





నం. 950

ఎవరెడి జీవన్-సాథీ

లోపల, బయట—అతి దిట్టమైనది


కలలుకనే
కన్నెపిల్లలకు
ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్
అల్లుడొచ్చాడు
నిర్మాత ఎ.వి. సుబ్బారావు
దర్శకత్వం కె. ప్రత్యగాత్మ
నవయుగ
NVKR
alpana

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాధుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938–1972]

శుక్రవారం : 18–6–'76

నలనామ సం. జ్యేష్ఠ బ. సప్తమి

సంపుటము : 69 సంచిక : 41

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

★

సంవత్సరచందా – రు. 33–80


ఆరుమాసాల చందా – రు. 16–90

విడి ప్రతి వెల 60 పైసలు

ఆంధ్రపత్రిక కార్యాలయము

గాంధీనగరం, విజయవాడ–520003.

విషయసూచిక



పూర్వం తంజావూరులో సోమరిపోతులకు ఒక సత్రం వుండేది. ఆవూళ్ళో పరమ బద్ధకస్తులు కొందరు వుండేవారు. తిండిలేక పస్తులు పడి ఉండేవారే గాని, తిండికోసం బిచ్చమెత్తడానికి కూడా వారికి ఓపిక ఉండేది కాదు. వారి స్థితికి జాలిపడి ఆ వూరి రాజు వాళ్ళకి ఉచిత భోజనంకోసం సత్రం ఏర్పాటు చేశాడు. దీనివల్ల ఫలితం ఏమిటంటే–కష్టపడి పనిచేసేవాళ్ళు కూడా పని మానివేసి సత్రం భోజనానికి సిద్ధపడేవారు. ఇలా సోమరితనం దినదినాభివృద్ధి పొందడం చూచి రాజు ఆ సత్రాన్ని మూసివెయ్యవలసి వచ్చింది.

అపాత్రదానంవల్ల ఇంతకంటె గొప్ప అనర్థం కలిగిన సంఘటనలూ ఉన్నవి.

ఒక ధన్మాత్ముడు దూర ప్రయాణికుల సౌకర్యంకోసం రెండు గ్రామాల మధ్య ఒక సత్రాన్ని కట్టించి, అందులో వివక్షణ లేకుండా అందరికీ భోజనం ఏర్పాటు చేశాడు. ప్రయాణంలో శ్రమపడి వచ్చినవాళ్ళు అక్కడ భోజనం చేసి విశ్రాంతి తీసుకుని తిరిగి ప్రయాణం సాగించేవారు. ఇలా జరుగుతూ వుండగా ఒకప్పుడు ఒకడు ఒక బక్క ఆవుతో అక్కడికి వచ్చాడు. అక్కడికి వచ్చేసరికి చాలా శ్రమపడి, ఎండదెబ్బకు తాళలేక అక్కడ కూలబడిపోయాడు. వాడు గోహంతకుడు. ఆ ఆవును పశువధ స్థానానికి తీసుకుపోతున్నాడు. అతడు చేయబోయేది మహాఘోరకార్యం. అయినా– ఆ సత్రం వివక్షణ లేకుండా అందరికీ భోజనం పెట్టేది కాబట్టి, అతనికి భోజనం దొరికింది. అన్నం తిని, కొంతసేపు విశ్రాంతి తీసుకుని ఆ తర్వాత అతడు తన ఆవుతో సహా ప్రయాణంచేసి గమ్యస్థానాన్ని చేరుకున్నాడు. ఇలా చేరుకున్నాక వాడు ఆ గోవును చంపాడు.

కొద్ది కాలానికి వాడు మరణించాడు. అన్నదానం చేస్తూ వుండిన ఆ సత్రం యజమానీ చనిపోయాడు.

ఇద్దరూ యమలోకం చేరుకున్నారు.

చిత్రగుప్తుడు ఈ యిద్దర్నీ యముని ముందు నిలుచోపెట్టి "గోహత్యను చేసిన మహాపాపం ఈ యిద్దరికీ చెరిసగం చెంది వున్నదనీ, వీరికి తగిన శిక్ష విధించాల"ని యమునికి విన్నవించాడు.

అన్నదాత ఆశ్చర్యపోయి "అదేమి స్వామీ! నేను, గోహత్య చెయ్యలేదే అందరికీ అన్నదానం చేసేవాడినిగదా! నాకు పాపం ఎలా వస్తుంది?" అని అడిగాడు.

"నీవు కోరి గోవును చంపలేదు అన్నదానం చేసినది కూడా వాస్తవము. అయితే నేం? నీవు చేసినది అపాత్రదానం. వివక్షణ లేకుండా అయోగ్యులకున్నూ అన్నం పెట్టడం వల్ల పుణ్యానికి బదులు నీకు పాపం సంభవించింది. ఈ దుర్మార్గుడు గోవును చంపడానికి వధ్యశాలకు తీసుకుపోతూ నీ సత్రానికి వచ్చాడు.. అపాత్రుడైన వీనికి అన్నదానం చేసినందున — నీవు గోహత్యలో వీనికి సహకరించిన ట్లయింది. అందువల్ల గోహత్యాపాతకంలో నీ వంతు సగం. ఈ పాపానికి తగిన శిక్షను అనుభవించవలసిందే! దానం చేస్తే పుణ్యం లభిస్తుంది. కాని, అయోగ్యులకు దానంచేస్తే పుణ్యానికి బదులు పాపమ సంభవిస్తుంది."

చిత్రగుప్తుడు ఇలా అనేసరికి ఆ అన్నదాత మరేమీ సమాధానం చెప్పలేక పోయాడు.

మనలో మాట

ఈ వారం నుంచి ప్రారంభించిన పెద్ద సీరియల్ వ్రాసిన శ్రీమతి యార్లగడ్డ సరోజినీదేవిగారు లోగడ కుమారి వీరపనేని సరోజినీ దేవిగా కూడా 'దేవత' 'సరళ' 'అనుపమ' 'విముక్తి' మొదలైన చాలా నవలలు ప్రచురించి పేర్గాంచారు. శ్రీమతి సరోజినీదేవి రచించిన 'గంగ' నవలనే వారి 'శ్రీవారు' శ్రీ యార్లగడ్డ రామచంద్ర రావుగారు 'మా వూరి గంగ' చలన చిత్రంగా తీశారు. ఇప్పుడు మరొక నవలను కూడా వారు సినిమాగా తీయనున్నారు. శ్రీమతి సరోజినీదేవి ఇటీవల "యుగసంధి" "భవ బంధాలు" "దూరపు కొండలు" మున్నగు చాలా నవలలు వ్రాశారు. ఆమెకు "రంగనాయకమ్మ నవలల పోకడ, కృష్ణ శాస్త్రిగారి గేయాలు, కొడవటిగంటి వారి వ్యాసాలు అంటే ఎంతో గౌరవం" అని తెలిపారు. 1943 లో కృష్ణాజిల్లా కైకలూరులో పుట్టారు. వాల్తేరు, హైద్రాబాద్‌లలో చదువుకున్నారు. జర్నలిజంలో కూడా డిప్లొమా పొందారు. వీరికి నలుగురుసంతానం ★



* ఉత్తరాలు *

డాక్టర్ సలహాలు

21-5-76 సంచిక డాక్టరు సలహాలులో నేను వ్రాసిన సమాధానంలో (మొదటి ప్రశ్నకు) సెంట్రల్ కవున్సిల్ ఆఫ్ రిసెర్చి ఇన్ ఇండియన్ మెడిసిన్, హ్యోమియోపతి అనే సంస్థద్వారా ఒక మందు శోభిమచ్చలకు వాడబడుతున్నదని పేర్కొన్నాను. ఆ సమాచారము 12-12-75 నాడు యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా అన్న వార్తా సంస్థద్వారా వచ్చి అన్ని ఆంగ్లభాషా పత్రికలలోను వెలువడినదని ఇందుమూలంగా తెలియచేయడ మైనది:

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు (మద్రాసు

సీరియల్

'కనువిప్పు' సీరియల్ చాలా బాగుంది. విశాల పడుతున్న కష్టాలు చదువుతుంటే మాకు తెలియకుండానే కళ్లవెంటనీరుకారినవి. ఈసీరియల్ వ్రాసిన రచయిత్రికి మా ధన్యవాదాలు. బొమ్మలు చాలా బాగున్నాయి. "కొలువు" కథ మా హృదయాలను కదిలించివేసింది ఈ పత్రిక ఇంకా ఇంకాఅభివృద్ధి కావాలని ఆశిస్తూ.

పి. జయచిత్ర (ముదినేపల్లి.

కథలు

ఈ వారం 28-5-76 పత్రికలోని "కొనక్కర్లేనిది" కథానిక డబ్బుతో ఏదైనా కొనుక్కొగలమనుకునే ధనవంతులకు, పక్కా వ్యభిచారులకు కనువిప్పు అని చెప్పకతప్పదు. ఇంత మంచికథను వ్రాసిన రచయిత్రి అభినందనీయురాలు. పత్రికకు ఈ కథ వింతలందాన్ని ఇచ్చినట్లుగా "కల్యాణ ఘడియ" పెళ్లికాని యువతులు సంఘంలో ఎదుర్కొనే సమస్యలను తెలియజేస్తూ మళ్లీ వారం కొంత సమస్య ఎలా తీరుతాయోనన్న ఉత్కంఠతను కలిగిస్తున్నది. శ్రీ సోమసుందర్‌గారి "రాలిన ముత్యాలు" చాల బాగున్నాయి.

కె. వాహిని (మిర్యాలగూడెం.)

సామాన్యుని సణుగుడు

ఈ వారం 'అస్తమించని అర్కుడు' అన్న సామాన్యుని సణుగుడు చదివి రాస్తున్నఉత్తరం ఇది.

మొదట్నుంచీ ఈ 'సణుగుళ్ల'లో బోలెడు సజెషన్లు దొర్లడం నేను గమనిస్తూన్నాను. వుదాహరణకి ఈ సారి "…. కాలవలున్న వూళ్ళు న్నాయి. రిజర్వాయర్‌లలో దాచి ఆ నీళ్ళు కాలవల్లో వదిలితే రావా (నీళ్ళు)…." వంటివి. అమూల్యమైన ఇలాంటి సజెషన్లు బావున్నాయని నాలాంటి పాఠకులు ఉత్తరాలు రాయడం తప్ప. ఆయా బాధ్యతలను నిర్వహిస్తూ ఆ'పర్టికులర్' ఫీల్డులో వున్న అధికారుల దగ్గర్నించి జవాబులు రావెందుకు? నిజంగా ఇలాంటి సూచనలు అమలు పరచ గలిగితే (సరైన పంధాలో) ఎంత బాగుంటుంది.

ఇది చూస్తుంటే తమిళనాడులో జరిగిన వో సంఘటన గుర్తుకొస్తుంది. నాకు. వో ప్రముఖ కార్టూనిస్టు (మదన్ అతని పేరనుకుంటాను) ఓ పత్రికలో ఒస్సుగీస్తూ ఆ బస్సుకి టాపు మీద ఎగ్జాస్టు పైపు గీసాడు. కేవలం నవ్వుకి నార్పిన ఈ బొమ్మని చూసి నవ్వుక డవే కాకుండా అదీ ఓ సజెషనుగా భావించి స్థానిక రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌వారు (పల్లవన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్) దాన్ని అమలులో పెట్టేందుకు సైతం ప్రయత్నాలు చేసారట.

శశిధర్, కార్టూనిస్టు (కాకినాడ.) ●

'పాట బాగుంది కదండీ ?'

అన్నాడు సీతాపతి

అవునని తలూపాను అయిష్టంగానే.

పాట నచ్చలేదని కాదు ఆ పాటని లోగడ చాలాసార్లు నేను విన్నాను. జిల్లాపరిషత్ పనిమీద శ్రీకాకుళం వెళ్లినపుడు ఆ సినిమా కూడా చూసాను. మంచి పాట. నాకిప్పుడు నచ్చనదల్లా ఈ సీతాపతితో మాట్లాడటమే.

పెద్ద చెల్లెల్ని దిగబెట్టడానికని వెళ్లి, ఒరిస్సా నుండి వస్తున్నాను. ఒరిస్సా రాయఘడలో వుంటున్నారు వాళ్ళు. పాసింజరు బండి పార్వతీపురం చేరేసరికి మూడయింది మధ్యాహ్నం. పుట్టి పెరిగిన వూరు గనుక ఎవరయినా తెలిసినవాళ్ళు కనిపిస్తారేమోనని కిటికీలో తల పెట్టి, ఆసక్తిగా చూసాను.

సీతాపతి ఇద్దరు పిల్లలుతోనూ, భార్యతోనూ నేనున్న పెట్టెలోకే ఎక్కాడు. ఆనందమనిపించింది. వాడూ నేనూ పార్వతీపురంలోనే మల్టీ పర్పస్ హైస్కూల్లో హైయ్యరు సెకండరీ కోర్సు చదివేం. అప్పట్లోనాకు సీతాపతీ, రామం, గోవర్ధనం, భుజంగరావులు బెస్టు ఫ్రెండ్సు. మేము అయిదుగురం కలిసి చేసిన అల్లరి అంతా యింతా కాదు. ఆ రోజులు ఎంత సరదాగా గడిచేయని !

డిగ్రీ చదువులకోసం, ఆ తరువాత ఉద్యోగాల వేటలోనూపడి, మేము విడిపోక తప్పింది కాదు. కాని బాల్యస్మృతులను నెమరవేసుకొనే మధుర క్షణాలలో మట్టుకు వాళ్ళు గుర్తుకు రాక తప్పదు. పనిభారంగా వున్నప్పుడు, మనసంతా చికాగ్గా వున్నప్పుడు — మనస్సుకి విశ్రాంతి కావాలనిపించినప్పుడు - మళ్ళీ ఆ రోజులు వస్తే ఎంత బాగుణ్ను ! 'ఎంత కులాసాగా తిరొగొచ్చు — అని పిస్తూ వుంటుంది.

ఆ భ్రమ కూడా తొలగిపోయింది.


సీతాపతి తీర్చేశాడు.

'నువ్వా! సీతాపతీ!' అన్నాను సంభ్రమంగా.

నల్లఫ్రేం కళ్ళద్దాలు సవరించుకుని ఓ క్షణం తటపటాయించి' 'మీరు - ంట చయనులు గదూ ?' అన్నాడు.

నా నెత్తిమీద మంచునీళ్ళు దిమ్మరించి నట్టు.

స్నేహమేరా జీవితం.... పంతుల జోగారావు



'మీర'ని అంటాడేమిటి!

'వెధ'వ్వంటే 'వెధవ్వ'నుకునేవాళ్ళం కాదూ? ఆ చనువు ఏమయిపోయింది? ఆ ఆత్మీయత ఏ గంగలో కలిసిపోయింది? నాకు ఏం మాట్లాడాలో కూడా తోచలేదు. ఇప్పుడు వాడ్ని ఎలా సంబోధించాలి?

'అవును పతీ' అన్నాను మధ్యేమార్గం ఎంచుకుని, కొంచెం చనువు స్ఫురింపచేస్తూ.

'ఎక్కడ నుంచి వస్తున్నారు?'

నా సందేహం తీరిపోయింది. వాడింక నన్ను పూర్వంలా దగ్గరగా, చనువుగా, సరదాగా, స్వచ్ఛంగా 'ఒరేయ్ చేనులూ!' అని పిలవడు. నాతో మా చిన్ననాటి ముచ్చట్లు పంచుకోడు.

సభ్యతకోసం—తనగురించీ, పిల్లలగురించీ అడిగేను. పార్వతీపురంలో వాళ్ళ అన్నయ్య వుంటున్నాడట. ఈమధ్యే ట్రాన్స్ఫరయి వచ్చేడట అనకాపల్లి నుండి చూసిపోదామని ఫేమిలీతో ఇక్కడకి వచ్చేడట.

'స్నేహమేరా జీవితం ...
స్నేహమేరా శాశ్వతం ....
స్నేహమే మనకున్నదీ
స్నేహమే మన పెన్నిధీ ...' గుడ్డి బిచ్చగాడి గొంతు బ్రిడ్జిమీద వెళ్ళే రైలు శబ్దంతో కలిసిపోయి అదో మాదిరిగా వినిపిస్తోంది. స్నేహం! జీవితంలో నిజమైన స్నేహితుల్ని సంపాదించుకోగల్గటం ఎంత అదృష్టం! స్నేహమనే వరమే యీ మనుషులకు లేకపోతే వీళ్ళెలా బ్రతగ్గలరు? జీవితం ఎంత ఇరుగ్గా, ఎంత దిగులుగా, ఎంత ఒంటరిగా అయిపోతుంది? ఎంత అర్థ విహీనమయి పోతుంది!

కృష్ణశాస్త్రిగారి మాటలు గుర్తుకు వచ్చేయి...

''ఒంటరితనం లోపల లోపల గుబులు గుబులు మంటుంది. ఈ దారంట ఇందరు నడుస్తున్నారు. ఒక్కరైనా లోనికి రారే! పోనీ స్ఫుటంగా అడుగుచిన్నెలయినా నాకోసం వదలరే అని ఏడుపు వస్తుంది. ఇలాగ తపించుకు పోతాను ... సావాసం కోసం ఈ తపన; ప్రేమకోసం ఈ ఏడుపు!...''

కాలం వేగానికి తట్టుకోలేక జీవితం అశాంతిగా, ఆదరా బాదరాగా, తీరుబాటులేని తనంగా పరిణామించింది.

ఆఫీసులో, వీధిలో, క్లబ్బులో నవ్వులు తగిలించుకున్న మొహాలు తిలక్ అన్నట్లు — అంతా అపోరకమయిన నాగరకతారణ్యపు వెగటు వాసన.

పండరూపాయలు పర్దటంతోనో, విందుకు పిలవటంతోనో ఈ స్నేహాలు సరిపుచ్చుకుంటున్నాయి. సాయంత్రమయేసరికి చీట్లపేకకి అరడజను మంది స్నేహితులు తయారు. వీళ్ళంతా నిజమయిన స్నేహితులేనా? కాని తప్పదు. అది తప్ప వేరే వ్యాపకం కూడా కనిపించటంలేదు. మనసు విప్పి మాట్లాడుకోవటానికి ఏదీ ఒక నిండు గుండె? పేకాట మానేస్తానంటే వీళ్ళు మళ్ళీ నా ముఖం చూస్తారా! నాచుట్టూ తిరుగుతూ, నాతో తమ కుటుంబ విషయాలు చెప్పుకునే రాఘవరావు కూడా ఎంత ప్రయత్నించినా నా మనసుకి దగ్గరగా రాలేకపోయాడు. స్నేహం చెయ్యలేక పోవటంలో నాలోపంకూడా లేదుకదా అనిపించి నన్నునేను విమర్శించుకునే వాడ్నికూడా! రాఘవరావు నా అనుమానాన్ని తీర్చేశాడు — అత్తెసరు మార్కులతో బి. కాం పాసయిన తన తమ్ముడికి మా కంపెనీలో నేను ఉద్యోగం చూపించలేక పోయినప్పుడు! నన్ను కలవటం మానేశాడు రాఘవరావు. నాకందుకు విచారం లేదు.

సరిగ్గా ఇలాంటి సమయాలలోనే హైస్కూలు జీవితం గుర్తొస్తూవుంటుంది 'ఒరే' అని పిల్చుకుంటూ 'వెధవా' అని కసురుకుంటూ ఒక్క క్షణం విడిచిపెట్టి తిరిగితే ఏం తరిగిపోతుందో నన్న భయంతో— ఆ రోజులు ఎంత సరదాగా గడిచిపోయేవని!

పగలంతా స్కూలులో కలిసేవున్నా — సాయంత్రమయేసరికి రైలుస్టేషను అవతల ఏటి దిబ్బలమీదికి షికారు వెళ్ళేవాళ్ళం. ఏ రోజయినా మాలో ఏ ఒక్కడు రాకపోయినా తెగ బాధపడిపోయేవాళ్ళం. ఒకరు లేకపోతే ఒకరు బ్రతకలేమనిపించేది. ఎన్ని కబుర్లు? ఎన్ని సరదాలు? వాటికి తరగటం అన్న ప్రశ్నే లేదు! వేసవి రోజుల్లో గోవర్ధనం వాళ్ళ మేడ

మీద చాపలూ, బొంతలూ పరచుకుని పడుకుని రాత్రి వెన్నెట్లో తెల్లవారేవరకూ కబుర్లు మీద కబుర్లు చెప్పుకుంటూ గడిపేవాళ్లం. సినిమాలకు వెళ్ళినప్పుడూ అంతే! అందరం కలిసివెళ్తే ఎంత గర్వంగా వుండేది? సినిమా చూసి వచ్చేక అభిప్రాయాల్తో సహా ఆ కబుర్లు ఒక వారం వరకూ తరిగేవి కావు...

కొంచెం పెరిగి, సెవెన్త్ ఫారంలోకి వచ్చేక కూడా మా అల్లరి తగ్గలేదు. చదువుల్లో కూడా మాదే ఫస్టు! పరీక్ష ఫలితాలు తెలిసాక — అందరం కలిసి విశాఖపట్నంలోనే కాలేజీలో చేరుదామనీ—ఒకే రూం తీసుకుని వుందామనీ—ఎన్నిసార్లు మేం అనుకోలేదు! అవన్నీ జరిగే విషయాలు కావని మాకు తెలిసిరావటానికి ఆట్టే రోజులు పట్టలేదు.

విడిపోయాం. గోవర్ధనం కాకినాడకీ— రామం హైదరాబాదులో వాళ్ల అన్నయ్య దగ్గరికీ—భుజంగం, సీతాపతి అనకాపల్లికీ— నేను మిగిలిపోయేను. బొబ్బిలిలో బి. కాం.లో చేరగలిగాను. అక్కడ చదివితే రోజూ పార్వతీపురంనుంచి బస్‌లో కేరియరు వస్తుంది. అదనంగా కావలసిన ఖర్చు కొంతలో కొంత

స్నేహమేరా జీవితం....

యినా తగ్గుతుందికదా అన్నారు నాన్నగారు. ఏమనగలను నేను మాత్రం?

విడిపోతున్న రోజున — దాదాపు అందరి కళ్లల్లోనూ నీళ్ళు తిరిగాయి. ఒక చక్ర—మూలాంటి స్నేహితులు ఎక్కడయినా వుంటారా అని కూడా గర్వపడ్డాం. ఒకరినొకరు మరచి పోకూడదనీ—వారానికి రెండేసయినా ఉత్తరాలు వ్రాసుకుంటూ వుండాలనీ ఎన్నో ప్రమాణాలు చేసుకున్నాం.

డిగ్రీలు పుచ్చుకునేవరకూ— జీవిత ప్రవాహపు వురవడి ఎలాటిదో తెలిసిరాలేదు. మొదట్లో బాగానే ఉత్తరాలు వ్రాసుకునే వాళ్లం. మాలో ఉద్యోగాలు దొరికేక ముందుగా భుజంగరావు పెళ్లి అయింది. అంతా వెళ్లాం, సీతాపతి తప్ప. ఎందుకో రాలేకపోయేడు. తరువాత సీతాపతిదీ, గోవర్ధనానిదీ జరిగాయి. నేనూ, రామం — యింకా బ్రహ్మచారులుగానే మిగిలిపోయేం — క్రిందామీదా, పెళ్లికి ఎదిగిన ఆడపిల్లలుండటంచేత—

రానురాను మా మధ్య ఉత్తరాలు కూడ తగ్గిపోయేయి. తీరికలేక కొంతా — సరైన అడ్రసులు దొరక్క కొంతా జవాబులు సరిగా రాకపోవటంచేత కొంతా — దిగులనిపిస్తూ వుంటుంది. అలాంటిది ఇప్పుడిలా సీతాపతి కనిపించేసరికి ఎంత ఆనందమనిపించింది! అతనితో చిన్ననాటి ముచ్చట్లు కలబోసి చెప్పుకుని తనివితీరా నవ్వుకోవాలని మనసు ఎంత ఆరాటపడింది!

నా ఆనందాన్నంతా చప్పగా చేసేసాడు సీతాపతి—ఒక్క సంబోధనతో ...

రైలు ఏదో స్టేషనులో ఆగింది. తొంగి చూసేను. సీతానగరం. పాసింజరు బళ్లకు యిది పాటరింగు స్టేషను. ఇరవై నిమిషాల వరకూ బండిని ఇక్కడ డిటెయిన్ చేస్తారు. సరిగ్గా సాయంత్రం కాఫీల సమయం కావటం వల్ల ఏమంత పెద్ద స్టేషను కాకపోయినా, ఇక్కడ కాస్త మంచి టిఫినూ, కాఫీ దొరుకుతాయి.

సీతాపతి లేచాడు. 'రండి చయనులూ! కాస్త కాఫీ తాగివొద్దాం' అని పిలిచాడు. అతనితోపాటు అతని పిల్లలిద్దరూ బిలబిలమని బయలుదేరారు. కాంటీను దగ్గరకి

వెళ్ళి కాఫీలకు ఆర్డరిచ్చి నిల్చున్నాం.

'మీకు భుజంగం గుర్తున్నాడుకదూ ?' అడిగేడు సీతాపతి.

'మీ ఐదో ప్రాణం గురించి మీకు తెలుసా?' అనడగలేదు సీతాపతి.

కాని అలాగ—అంతకంటే కూడ క్రూరంగానే అడిగినట్టయింది. నా మనసు విల విలలాడి పోయింది. సీతాపతి యిలా మారిపోయాడేం ? హైస్కూలు చదువుకీ – భిలాయి కంపెనీలో అతనికి లభించిన పెద్ద ఉద్యోగానికీ మధ్య కనిపించని అంత అగాధం ఉందా?! హైస్కూలులోని మా స్నేహాన్ని అతనేమీ సీరియస్‌గా తీసుకోలేదా ? అది అతని మనసు మీద ఎలాంటి ప్రభావాన్నీ కలిగించలేక పోయిందా ?

'భలేవారు ! భుజంగంగాడు తెలీకపోవడమేమిటి ?' అన్నాను నొక్కిపట్టి.

బలమైన బాంబు, సీతాపతి గుండెకి గురిచూసి విసిరేననుకున్నాను. ఆ బాంబు అతన్ని అణుమాత్రం చలింప చేయలేదు.

నిబ్బరంగా అన్నాడు 'అతనొక ఇడియట్'

కాఫీ చప్పరిస్తూ త్రుళ్ళిపడ్డాను. నా అదురుపాటుని కప్పిపుచ్చుకోవటానికని, 'ఏమోయ్— ఇందులో షుగర్ ఇంత తక్కువ వేసావేమిటి ?' అంటూ మరోస్పూను పంచదార వేయించుకున్నాను, కాఫీ పానకంలాగా అధ్వాన్నంగా తయారయింది. అప్పటికి కొంచెం స్థిమితపడి. అతను చెప్పబోయేది వినటానికి సిద్ధపడుతూ చూసాను.

'ఇద్దరం కలిసి అనకాపల్లిలోనే చదివాం. మీకు గుర్తేకదూ ? హైస్కూలులోలాగ 'ఒరే' అంటే 'ఒరే' అని పిల్చుకుంటే కాలేజీలో ఏం బాగుంటుంది చెప్పండి ? నాలుగయిదు సార్లు గట్టిగానే మందలించేను వినడే !— నాకు అసహ్యం వేసింది. సభ్యతలేని మనుషులతో స్నేహమేమిటి లెండి...'

సీతాపతి ఏదో చెప్తున్నాడు.

నా ఒంటిమీద — తేళ్ళో, జెర్రెలో ప్రాకుతున్నట్టనిపించింది.

సభ్యతట ! సభ్యత ! సీతాపతి మాటలు వినటానికే అసహ్యం అనిపిస్తోంది. ఇంజను పెట్టెలనుంచి వేరయినట్టుంది. ఆ కుదుపుకి రైలుపెట్టెలు కొంచెం కదిలాయి. 'రైలు వెళ్ళిపోతోంది నాన్నా!' అంటూ అరిచేరు సీతాపతి పిల్లలు గాభరాగా, 'ఫరవాలేదు ... ఇంకా వుంటుంద్రా' అని వాళ్ళకి సర్ది చెప్పాను.

సీతాపతి ఇంకా చెప్తున్నాడు. "అప్పట్లో ఒకసారి మా క్లాస్‌మేటు ఒక అమ్మాయితో మాట్లాడుతూ వుంటే – 'వెధవా – ఇక్కడ్రటా వుండేది ? నీకోసం ఎంతని వెదకనూ !' అంటూ అరుస్తూ వచ్చేడు. నాకు మండిపోయింది. అమ్మాయిల ఎదుట నయినా కాస్త మర్యాద పాటించవద్దూ ? 'వెధవా' అనో, 'ఏరా' అనో పిల్చుకున్నంత మాత్రాన గొప్ప స్నేహం అయిపోతుందా చెప్పండి ? అతనలా పిలుస్తూవుంటే నాకు తల కొట్టేసి నట్టయింది— ఆ తరువాత అలా పిలవొద్దని గట్టిగా కాషన్ యిచ్చేను.

వినలేదు. నా కాషన్ ఈజీగా తీసుకున్నాడు. అలాంటి మనిషితో నేను మాత్రం ఎందుకు ఫ్రెండ్ షిప్ చెయ్యాలి చెప్పండి? ఓ నమస్కారం పెట్టేసి అతన్ని పలకరించటం మానేసాను. అసలింతకీ – తనకే నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ వచ్చిందని అతనికా గర్వం తెలుసా అండీ ?"

తేలిపోయేడు మనిషి.

ఇదీ సీతాపతి అసలు స్వరూపం. భుజంగరావు తనకు స్కాలర్‌షిప్ వచ్చిందని వ్రాస్తూ సీతాపతికి రాకపోవటం తనకి చాలా బాధ కలిగించిందంటూ వ్రాసిన ఉత్తరంలోని ముక్కలు నాకింకా గుర్తున్నాయి. మనసంతా చికాగ్గా తయారయింది. కాఫీలు ముగించి మళ్ళీ కంపార్టుమెంటువేపు దారి తీసాము. పాన్‌వాలా తోపుడు బండితో ఎదురయితే బిస్కెట్ పాకెట్‌కొని సీతాపతి కొడుకు చేతిలో పెట్టాను.

'ఎందుకండి అనవసరంగా యివన్నీ' అని నవ్వేసి, సీతాపతి మళ్ళీ తన సంభాషణని కంటిన్యూ చేసాడు. 'అతని పెళ్ళికి మీరంతా వెళ్ళారు... అప్పట్లో ఏదో అత్యవసరమయిన పనిమీద హైదరాబాద్ వెళ్ళవలసి రావటంతో నేను రాలేకపోయాను – కదూ?'

'మరే' తలూపాను.

'నిజానికి ఆ పెళ్ళి తప్పించుకోవాలనే నేనా కాంప్ పెట్టుకున్నాను భుజంగరావు మీకు చెప్పలేదూ?'

భుజంగరావు సీతాపతి కాదుగదా అలాంటి విషయాలు చెప్పి తేలిక పడిపోవటానికి! అడ్డంగా తలూపేను; అసహనంగా ఎదురు తిరుగుతున్న గుండెను అదిమి పట్టుకుంటూ.


'కారణం మరేమీ లేదు – నేనిందాక చెప్పానే – ఓ అమ్మాయి ఎదుట నన్ను ఫూల్ చేస్తూ వాగేడని – ఆమే సుజాత భుజంగం ఆమెనే పెళ్ళి చేసుకున్నాడు—' సీతాపతి ముఖంలో ఉద్రేకం స్పష్టంగా కనిపిస్తోంది. రచయితగా నాకున్న వరమల్లా మనుషుల్ని చదవటం.

చూచి చూచి అడిగేను 'మీరు సుజాతను ప్రేమించారా ?' సీతాపతి మొఖం ఒక్కసారి వెలిగింది. అంతలోనే ఏదో పోగొట్టుకున్నట్టు దిగులుగా తయారయింది.

'ఆమె నన్ను గాఢంగా ప్రేమించింది' అన్నాడు మెలికపెట్టి.

ఈ మనిషి మాటల్లోనే యిన్ని మెలికలున్నాయి. ఇంక మనసులో ఎన్ని వంకరలో ?

గంట కొట్టారు. బండి కదలబోతూంది. పిల్లల్ని ఎక్కించి గబగబ రైలెక్కాము.



స్నేహమేరా జీవితం....

ఇంక సీతాపతితో మాట్లాడటానికి నాకేమీ మిగల్లేదనిపించింది.

సీటులో కూర్చున్నాక — ఓడ్ హౌస్ నవల . 'ది స్మాల్ బేచ్‌లర్' తీసాను, నా విముఖత స్పష్టపడేలా. ఏమనుకున్నాడో సీతాపతి కూడా మరేమీ మాట్లాడలేదు. అంతవరకూ వాళ్ళావిడ చదివి పడేసిన సినిమా పత్రిక అందుకుని పేజీలు తిరగెయ్యటం మొదలు పెట్టాడు.

నాకు నవలమీద దృష్టి నిలవలేదు. అతని గురించే ఆలోచిస్తున్నాను. మనసంతా చికాగ్గా తయారయ్యింది. భుజంగం — గోవర్ధనం — రామం — వాళ్ళు కూడా ఇలాగే తయారయి వుంటారా ? ఉహూఁ! ఒక్కనాటికీ కాదు...అలాగే అయితే తనీ లోకంలో ఈజన్మకి మంచి స్నేహితుల్ని పొందగలడా ?

గుడ్డి బిచ్చగాడు మళ్ళీ అదే పాట ఎత్తుకున్నాడు. వాడు మాపెట్టె వదిలినట్టు లేదు. సాధారణంగా ఇలాంటి గుడ్డివాళ్ళకి వెనుక తోడుగా ఎవరో ఒకరుంటారు. వీడు పాపం, ఆ అదృష్టానికీ కూడా నోచుకున్నట్టు లేదు.

వాడు పాట పాడేతీరు అంత బాగుండక పోయినా, ఆపాటలోని భావం మనసుని కదలింప చేసేది కావటంవలన కాబోలు కళ్ళు పుస్తకం మీద వుంచినా వాడి పాటనే వింటూ ఆలోచిస్తు కూర్చున్నాను. కంపార్టుమెంటులో జనం బాగానే వున్నారు. అంతా ఎవరి సంభాషణలో వాళ్ళున్నారు.

పాట ముగిసింది. డబ్బులు అడుక్కుంటున్నాడు. దగ్గరకివస్తే యివ్వొచ్చనుకుంటూ మళ్ళీ పుస్తకంలోకి మునిగిపోయాను.

ఇంతలో—మాది లింక్ కంపార్టుమెంటు కావటం మూలంగా అవతలి పెట్టెలోనుంచి మరో బిచ్చగాడు ఏదో పాడుకుంటూ వచ్చేడు. తలెత్తి చూసాను. రద్దీగా వుండటంచేత మనిషి సరిగా కనిపించటంలేదు. కాని స్వరం బాగుంది. వీడికంటే చక్కగా పాడుతున్నాడు. ఆ పాట వింటూ, పుస్తకం మూసి కిటికీలో నుంచి బయటకు చూస్తూ కూర్చున్నాను. పచ్చని పంటచేను కళ్ళకి మనోహరంగా కనిపిస్తోంది. ఆకాశంలో తెల్లని మబ్బులు ముక్కలు ముక్కలుగా అందంగా వున్నాయి. చల్లనిగాలి వీస్తోంది.

'ఎవులదీ...సి వాసెలమా!'

అంతవరకూ మా కంపార్టుమెంటులో పాట పాడిన బిచ్చగాడి గొంతు వినిపించింది. ఎవర్నో గొంతు వినే గుర్తుపట్టినట్టున్నాడు ఎంత చిత్రం!

'నేను...నేనేరా సింహాసెలాన్ని నువ్వు ...'

'నేన్రా గనేసాన్ని...'

వాడి గొంతులో ఆశ్చర్యం, ఆనందం అవధులు దాటి స్ఫురిస్తోంది. 'అబ్బ! ... ఎంత సిత్రం ... మళ్ళా మనం కలుస్తామను కున్నాంరా ?'

రైల్లో ఇంతమంది వున్నారు. వాళ్ళతో సంబంధం లేనట్లుగా మాట్లాడేసుకుంటున్నారు. వేరే వ్యాపకం ఏదీలేదు కనుక ఓ చెవి అటు పడేసాను.

'అంతా ఆ సింహాద్రప్పన్న దయరా సింహాసెలం ... ఇంతకీ నువ్వు పారిపోనావేట్రా, మమ్మల్నొగ్గేసి...ఇంతకాలం ఎక్కడున్నావురా ఎదవా!' ఆ గొంతులో అంతులేని ఆత్మీయత.

'ఏటి సెప్పమన్నావు గనేసా! ఆయేల నీ కొడుకుని యీ ఎదవ పాపిష్టి సేతుల్తో ఎవలకో అప్పసెప్పేసినానా— సూతాండమని సెప్పేసి మరి ఆదెమ్మతో గవర్నమెంటు ఆస్పత్రికి మందు కోసం ఎల్నాను...ఇంతలో వొర్సం బాదేసినాది — సత్రంలో ఓ మూల కూకున్నాను — గుడ్డిముండా కొండుకుని — ఎవులో వచ్చేద్రాగనేసం — పిక్కిరోడు ఏడుస్తుంటే—'ఎదవ ... గుడ్డెదవా! గుంటడు సుక్కపట్టి 'ఏడుస్తుంటే ఏటలా వాళ్ళో ఎట్టుకూకున్నావు, లే!' అనడిగిరి—ఆళ్ళెవరో- ఏటో—తెలుసుకోకుండానే యిచ్చేసినాను —సింహాద్రప్పన్న సాచ్చికంగా నాకేటి తెల్దురా గనేసం—ఈ గుడ్డోడ్నికూడా అంత అన్నేయం సేసేసే ఎదవలు—పచ్చినెత్తుర్ను తాగేవోల్లుంటారని తెలవదురా నాకు—తరువాత తెలిసింది — అళ్ళలాగే సత్రంలో మరో ముగ్గురు గుంటల్ని తీసికెలిపోనారని నేను బయంతో పణికిపోయ్నేనా. నువ్వొచ్చి అడిగితే ఏటని సెప్పడం ? పేణం గిలగిలలాడిపోనాది. నాకేటీ సోచనేదు. అందుకే పారిపోనాను. ఎన్నివూళ్ళు తిరిగానో గుడ్డోడ్ని ఒక్కడ్ని. ఏ యమ్మ దయసూపినా ఆ పూట గడిసిపోద్ది. నన్ను నమ్మురా గనేసా. నా నేటి తెలిసి అన్నేయం సెయ్యనేదురా.' వలవల ఏడుస్తున్నాడు వాడు.

ఆసక్తికరమయిన ఈ దృశ్యం చూస్తూ అంతా వుండిపోయేరు. వాళ్ళ సంభాషణ నన్ను కదిల్చివేస్తోంది. ప్రపంచం ఎంత విచిత్రమయినది! కటిక దరిద్రుడ్ని మొదలు కోటీశ్వరుడి వరకూ ఎవర్ని కదిపినా ఎన్ని

కథలు ? మరెన్ని వ్యథలు !

'వూరుకోరా సింవాసెలం — వూరుకో — ఏటలా సిన్నపిల్లాడిలా ఏడుస్తావు. సింవాసెలం కొండమీద తిరణాలకి మనం జత కలిసిందగ్గర్నుంచీ నీ మనసెట్టాంటిదో తెల్దురానాకు ? నీదేటి తప్పునేదు కదరా! మా కరమం అలా వుండబట్టి జరిగింది. మమ్మల్ని ఒగ్గేసి నువ్వెలిపోయాక—నా కంతా తెరిసిందిరా — ఏటిసేస్తాం ? నువ్వు ఎలిపోనావని నేనూ ఆదెమ్మా అనుకోని రోజు నేదంటే నమ్ము—' అని ఓదారుస్తున్నాడు గణేశం.

'మరిసిపోనాను...అక్కెలావుంది?' చప్పున అడిగేడు సింహాచలం.

గణేశం గొంతులో వేదన ధ్వనించింది: 'ఇంకెక్కడి ఆదిరా సింవాసెలం—అది నన్ను అన్యాయంచేసి పోనాది—ఆ సావు గుడ్డెదవని నాకైనా వొచ్చినాది కాదు — కనిపెట్టుకు నుండేది—అది పోనాక నాకు సెయ్యి యిరిగి పోనట్టయిపోనాది—'

'హోరి దేవుడా! అక్కపోనాదా!' దాదాపు గొల్లుమన్నట్టుగానే అన్నాడు గణేశం. ఆ వేదనలో నిజాయితీ. ఆ దుఃఖంలో అభిమానం నన్ను విచలింపచేస్తున్నాయి.

'ఏమిటీ న్యూసెన్స్' విసుక్కుపోతున్నాడు సీతాపతి. పెట్టెలోవున్న వాళ్లలో కొందరు వాళ్ల సంభాషణను జాలిగానూ, కొందరు విసుగ్గానూ, మరి కొందరు వినోదంగానూ వింటున్నారు. మొత్తంమీద అందరిదృష్టి వాళ్లమీదే వుందని చెప్పాలి.

వాళ్లిద్దరూ ఒకర్నొకరు వోదార్చుకున్నారు. 'వూరుకోరా గనేశం—అయిపోయింది అయిపోనాది—ఇకనుంచి నీకు నేనూ, నాకు నువ్వూ తోడుగా వుందాం కద ? కట్టంలో సుకంలో కలిసుందాం—సింవాద్రప్పన్న మన కింత కూడు దొరికేటట్టు సెయ్యక పోడు' ధైర్యం చెప్పాడు సింహాచలం.

వాళ్ల భయాలతోగాని, విశ్వాసాలతోగాని నిమిత్తం లేకుండా రైలు వేగంగా దూసుకు పోతూనే ఉంది.

* * *

విజయనగరం దీపాల్లో వెలిగిపోతోంది.

రైలు దిగేను.

సీతాపతి ఇంకా వాల్తేరు వరకూ వెళ్లాలి.

సీతాపతి రైలుదిగి వచ్చేడు. ఇద్దరం రైలు తిరిగి కదిలే వరకు బుక్‌స్టాలు దగ్గర గడిపేం — నాకు మాత్రం వింత వేగంగా వదుల్చుకుని యిల్లు చేర్దామా అని ఉంది. చిరాకుని సాధ్యమయినంత కన్పించనివ్వకుండా ప్రయత్నం చేసాను. గంట కొట్టేరు. అతనూ నేనూ కంపార్టుమెంటు దగ్గరకి వెళ్ళాం. సీతాపతి రైలెక్కాడు. సీతాపతి పిల్లలు 'అంకుల్ టాటా' అంటూ చెయ్యి వూపుతున్నారు.

నవ్వుతూ వాళ్లకి చెయ్యివూపుతున్నానే కాని, నాదృష్టి అంతా ఆగుడ్డివాళ్ల మీదే ఉంది. నా చెవులకి ఇంకా వాళ్లమాటలు వినిపిస్తున్నట్టే ఉంది.

రైలు కదలబోతున్నది.

అంతవరకూ మూసేసి — మళ్ళా ఏం ఆలోచించుకున్నారో — ఆ బిచ్చగాళ్లిద్దరూ అప్పుడు ప్లాట్ ఫారంకి అవతలివేపుకి దిగబోతున్నారు. అరె! ఇంతసేపూ ఎందుకు వూరుకున్నారు! గాభరాగా అరిచాను. 'వద్దు రైలు కదుల్తోంది, జాగ్రత్త !' అని. అప్పటికే ఒకడు దిగేశాడు. అతడు రాళ్లమీద కాలువేసి జారిపడటం జనం మధ్యనుంచి అస్పష్టంగా కనిపించింది. నాగుండె నెవరో కుదిపి వేసినట్లయింది. గాభరాగా చూస్తున్నాను. రెండోవాడు కూడా దిగేశాడు. జనం రద్దీలో అవతల ఏం జరిగిందో కూడా కనిపించలేదు. కంపార్టుమెంటులోని వాళ్ళు కూడా 'భస్త్రరా బాబూ!' అంటూ సంద లించటం — వాళ్ళు దిగిపోవటం — అంతా అనుకోకుండానే త్రుటికాలంలో జరిగి పోయింది.

'అరె ! పాపం...' నాగొంతులోని తీవ్రత నాకే స్పష్టంగా తెలుస్తోంది. కదుల్తున్న రైలుతోటే రెండడుగులు వేసాను.

'ఫరవాలేదు చయనులుగారూ! వాళ్లకేం కాదులెండి — అలాంటి వాళ్లకే అసలు ఆయుర్దాయం హెచ్చుగా వుంటుంది ! — ఒకవేళవాళ్ళు చచ్చినా ఏం నష్టం ? కాస్త భూభారమయినా తగ్గుతుంది' జోక్ చేసినట్లుగా నవ్వుతున్నాడు సీతాపతి. నాగుండె గుబగుబ లాడింది.

నాకు లోపల బనియను చెమట్లతో తడిసి పోతున్నది. నాతో పాటే మరికొందరు కూడా కళ్ళు వప్పగించి చూస్తూ వుండిపోయేరు.

రైలు వేగాన్ని అందుకుంది.

నాగుండె వేగాన్ని పుంజుకుంది.

'ఏం జరగకూడదు భగవాన్ !'


* * *

రైలు పూర్తిగా విడుటనుంచి వెళ్లి పోయేక — చప్పున ఆత్రతగా పట్టాలవేపు చూసేను.

అవతలి వేపు దృశ్యాన్ని చూసి, తృప్తిగా గుండెనిండా గాలి పీల్చుకున్నాను. గుడ్‌గాడ్ ! వాళ్ళకేం ప్రమాదం జరగలేదు !

ఆ ముష్టి వాళ్ళిద్దరూ ఒకరి భుజం మీద ఒకరి చెయ్యి వేసుకుని నిబ్బరంగా వెళ్ళిపోతూ అల్లంత దూరంలో కనిపించేరు. నాగుండె మీదనుంచి ఏదో గొప్ప బరువు తీసేసి నట్లనిపించింది. తృప్తిగా నిట్టూర్చాను.

'స్నేహమేరా జీవితం...' వాడి పాటయింకా నాచెవుల్లో గింగుర్లు తిరుగుతూనే ఉంది!



"మీ కార్టూన్లు వాళ్లకి నచ్చలేదేమో...అందుకే తిప్పి పంపారు...అమాత్రందానికే మీరింతగా బాధపడిపోవాలా !!"
"మరైతే ఇవే కార్టూన్లని రెండు సంవత్సరాల క్రితం ఎవరో వేస్తే ఎలా ప్రచురించుకున్నారు ?"

ఫైల్స్ డైరీ

పంజాబ్ ప్రత్యేకత!

అన్ని రాష్ట్రాలూ ప్రత్యేకించి ఒక్క సరుకు వెలలు తగ్గిస్తున్నారే మనమేం చేయరాదా అని ఆలోచించి పంజాబు రాష్ట్రం మద్యం ధర తగ్గించిందట. . .భళా!

పసిగుడ్డు వెల 5 రూ. లా!

తమిళనాడుకు చెందిన అనసూయ అనే ఆమె ఆహార్యాలు పదడానికి కొందరు పారిపోయి అక్కడ బ్రతుకు తెరువు కోసం ఏదో ఓ పని చేయాల్సిరావడం వల్ల వేరే ఏ పని చేయడం రాకుండటవల్ల వ్యభిచారం ఆరంభించిందట. ఆమెకు పచ్చ పెయింటర్ ఎంగా సామి అనే విటుడు నాటికగా రావటంవల్ల అతనితో స్నేహం పెంచుకుని వ్యభిచారాలమాని, కొందరాయి కైతే స్నేహను తగ్గరటరటవల్లఅమ్మే వ్యాపారం ఆరంభించిందట. ఓ రోజు ఆడాయన తన స్వాధీనంలో పసిగుడ్డును అనసూయకిచ్చి ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్ళి తిరిగి వచ్చేసరికిఅనసూయ అంతర్ధానమైపోయి, మద్రాసులో చేరి, ఆ పసి పిల్లాడిని ఐదు రూపాయలకు అమ్ముతూ పోలీసులకు దొరికిపోయిందట.

దొంగతనం—హత్య

సింగపూరుకు చెందిన 63 ఏళ్ళ రామన్ అనే ఆయన పెళ్ళాం పిల్లలవాళ్ళ వారిని వదలి విస్వసించి వేరే వంటరిగా వుంటున్నాడట. మొన్న ధనహానితో తెరిచిన హృదయం చూపేసరికి నోట్లో గుడ్డలతో ఆయన పడిపోయి వున్నాడట. ఆయన యిల్లంతా ఎవరో సోదా చేసినట్లుందట. ఇంట్లో కొంత డబ్బు, బంగారం అంతా పోయిందట. దీన్నిబట్టి ఎవరో ఆయన నోట్లో గుడ్డలు కుక్కి, చంపి యిల్లంతా దోచుకు పోయారని పోలీసు అనుమానిస్తోందట అది వారి దైవం!

గుట్టు రట్టు — ఆత్మహత్య

గోపి అనేపూరుకు చెందిన అగ్నిపమాకదళంలో పని చేస్తున్న పపుందన్న అనే ఆయన భార్య 25 ఏళ్ళ జయమ్మ అదే పూరిలో ఒకతనితో రహస్య సంబంధంపెట్టుకుందట. ఈ విషయం పుంద గలిగినవాళ్ళు పుంది అనకబట్టిబయట పడిందట. దాంతో పపుందన్న భార్యను తిట్టాడట. తన రహస్య ప్రేమాయణం పూర్తో బయటపడే తరి యడం వల్ల జయమ్మ కరపనాయిలు పోసుకుని అగ్గిపుల్లంటించుకుని ఆత్మహత్య చేసుకుందట.

విమానాలకు పక్షుల బెడద

విమానాలకు, విమాన దళాలకు ప్రపంచంతో పక్షులు బద్ధశత్రువులయి పోతున్నాయట. అదా


శంలో ఎగిరే విమానాలను పక్షుల బృందం తరిమి తరిమి ముక్కులతో చిల్లులు పొడిచి నాశనం చేస్తాయట. కొన్ని కోట్ల రూపాయల ఖరీదైన విమానాల్నూ, అంతకు మించిపోని ప్రాణాల్నూ కూడా యిలాటి కొన్ని సందర్భాలలో పోతున్నయట. ప్రపంచంలో ఎగిరే విమానాలలో కనీసం పక్షిపోటు రోజుకు 30 విమానాలయినా గురి అవుతున్నాయట. ప్రపంచ దేశాలలో మనదేశంలో పక్షులు ఎక్కువే అయినా పక్షిపోటు తక్కువట మనకు. మనవన్నీ ప్రేమపక్షులు. యస్! లవ్ బర్డ్స్!!

బొంబాయి నేరాలు

బొంబాయిలో పోయినేడు 139 హత్యలు 720 హత్యా ప్రయత్నాలు, 14,000 దొంగతనాలు 3,000 నల్ల వ్యాపారనేరాలు పట్టుబడ్డాయట. మరి బలాత్కారాలు, మానభంగాలో!!

ప్రేమాయణం-ఫలితం-ఆత్మహత్య

పోణూరుకు చెందిన కదడిమడ్డె అనే వూరిలో పట్టిలింగం అనే ఆయనకూతురు 23 ఏళ్ల సుబ్బలక్ష్మి ఆ వూళ్లో వో యువకునితో ప్రేమాయణం పెట్టుకు పెంచుకుందట. తత్ఫలితంగా పొందగానే తాను గర్భవతినని గ్రహించి, యీ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే యిక తనకు నిలువ నీడుండదని భయపడి పెరట్లోనూతిలో దూకి ఆత్మహత్య చేసుకుందట.



ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

పి. వి. ఆర్. చిట్యాల

సమాన హక్కులు కావాలనేడి వారికి రైళ్లలో, బస్సుల్లో, సినిమాహాళ్లలో ప్రత్యేక సీట్లు దేనికండీ?

స్త్రీని కూడా సాటి మనిషిగా గౌరవించడం మీ పురుషులంతా నేర్చుకొనేదాకానే యీ ప్రత్యేకతల ఆవశ్యకత. సభ్యత, సంస్కారం మరిచి ఒంటరి స్త్రీలని ఎంత 'గౌరవంగా చూస్తున్నారో మీరు చూడడం లేదా? వినడం లేదా? కావాలని రాసుకుంటూ పోయేవాళ్లు, తోసేవాళ్లు, అసభ్యంగా మాట్లాడేవాళ్లు, ప్రవర్తించేవాళ్లు ఎందుకలా చేస్తున్నారు? ఆ ఎదుటి స్త్రీ తమ సోదరో, భార్యో, ప్రియురాలో, తల్లో, చుట్టమో అయితే చేస్తారా? !

వి. ఎస్. కరీంనగరు

ఆడది బ్రహ్మచారిణిగా ఉండాలంటే కష్టమా?

కాదు ఆర్థికంగా తన కాళ్లమీద తాను నిలబడకలిగినట్లయితే. అలా కాక, ఏ అన్నదమ్ముల పంచనో తల్లిదండ్రుల పంచనో పడి ఉండాలంటే బ్రహ్మచారిణిగా ఉండడం కంటే ఎవడినో ఒకడిని కట్టుకుని సంసారయాత్ర సాగించడం మేలు.

ప్రేమ వివాహాలపై మీ అభిప్రాయం?

బాధ్యతలంటే భయపడని వాళ్లకే ప్రేమ వివాహాలు.

టి. ఏ. ఎస్. ధవళేశ్వరం

30.1.76 వారపత్రిక ముఖచిత్రం అంతర్జాతీయ మహిళా సంవత్సరానికి గీటురాయా? కలికితురాయా?

ఏదీ కాదు. సేల్సు పాయింట్!

ఎం. టి. ఆర్. — ఒంగోలు

మీ జీవితాని కేదైనా పరమార్థం వుందా?

పరమార్థం అంటే మీరేం అర్థం చెప్తారు?.. అర్థమే పరమార్థం అని బ్రతికేయలేక, అర్థ పరమార్థాల మధ్య కొట్టుమిట్టాడుతుంది ఆత్మ. అలాంటి ఆత్మకి తగిన దోహదం (అంటే తిండీ బట్టా, బుర్రకి కాస్త మేతా, మనస్సుకి కాస్త జల్సా) చేస్తూ ఏరోజుకారోజు, ఏ పూటకా పూట ఏ గంటకాగంట, ఏ క్షణానికాక్షణం బ్రతుకు తల్లిస్తూ బ్రతకడమే యీ కలియుగంలో సామాన్యమైన మనిషి ఆశించగల పరమార్థం.

వి. వి. ఆర్. — మచిలీపట్నం

మీ కింత తెలివి ఎలా వచ్చింది?

తెలివి అంటే ఏమిటి? తెలిసినప్పుడు చెప్పకోకుండా వుండకల్గడం తెలియనప్పుడు తెలుసుకుందుకు ముందుకి రావడం అంతేకదా?

బి. పి. ఆర్. రాయిగడ

ఎప్పుడూ డబ్బు, డబ్బు అనేవాళ్లని ఏమి చేయాలి?

ఏం చేయనక్కరలేదు నాయనా, వాళ్లనా డబ్బు ఎలా వస్తుందో చూసైనా నేర్చుకోవాలి!

జి. వి. ఆర్. — బ్రాహ్మణగూడెం

సమానత్వం వ్యక్తిత్వం అంటారే గాని దాని ప్రభావం మధ్య తరగతి ప్రజలలో ప్రబలి ఏవిధంగా వాళ్ల పతనానికి దారి తీస్తున్నదో మీకేమైనా తెలుసా?

అసలీ మధ్యతరగతి ప్రజలెవరో మీకు తెలుసా అని... ఏ సంస్కరణకైనా గెలుపు ఓటమి నిర్ణయించగల్గిన శక్తిగల తరగతి మధ్య తరగతి వీరిలో మీరన్న సమానత్వం వ్యక్తిత్వం' బాధ పతనమై పోతూన్నది లేదా జాతి అనే పదం చూడండి రావుగారూ, సంఘం జాగోగులు నిర్ణయించకల యీ మధ్యతరగతి మహిళ కాస్త ప్రభావితం అయితే సాధించలేని దంటూ ఉండదు. మధ్యతరగతి నిజంగా కట్టుదిట్టంగా తిరగబడితే ఎప్పుడో సాంఘిక దురన్యాయాలుగా మారి పీడిస్తున్న కట్నం, అధిక సంతతి, మద్యం మొదలైన గాయంగా మారిన ఆర్థిక మాంద్యం అన్నీ రూపుమాసి పోయేవి.

జి. ఎస్. ఆర్. ఖమ్మం

మీ ప్రశ్నలు ఎందుకులే చదువుట అని చదువుతాను. దీనికి కారణం ఏమిటంటారు?

వో ఆడది రాయడం, నేను చదవడం కానా అని. ఆడది రాసిందికదా ఏం రాసిందో అని!

డి. జె. పి. — భువనేశ్వర్

వయస్సు మళ్లిన వారు సహితం మీ శీర్షికను అత్యంత శ్రద్ధతో పఠిస్తున్నారు ఎందుచేతనంటారు?

కుతూహలాన్ని వయస్సు జయించలేదని దీని అర్థం.

సినిమాలను చూసి చెడ్డను అనుకరించిన విధంగా మంచిని ఎందుకండీ అనుకరించరు?

మన సినిమాల మంచి చెడ్డ నిర్వీర్యంగా 'పిరికి పీనుగ' మంచిలాగా వుంటుంది. అందుచేత మనలో మన మాట; నాకూ ఎప్పుడూ అనిపిస్తూ ఉంటుంది విలన్ మగాడిలాగా, హీరో నీచ్చులాగా ఎందుకుంటారని?...

చిరునవ్వుతో ఈ దేహాన్ని త్యజించడం ఎలా?

చిల్లి గవ్వ మిగల్చక పోవడమే. అప్పుడు చచ్చేవాడు నవ్వుతూ చచ్చి పోవచ్చు. బ్రతికిన వాళ్లు ఏడుస్తూ తీసిపారేసినా బాధ తెలియదు.

డి. వి లాలాపురం

స్త్రీ కోరే రెండు వరాలు మంచి భర్త, ఆరోగ్యవంతమైన సంతానం అని సమాధానం ఇచ్చారు మరి అయితే స్త్రీకి సమాన హక్కులెందుకు?

సంతానానికీ, సమత్వానికీ పొత్తు కుదరదా? సంతానవతి, గృహిణి అయినంత మాత్రాన స్త్రీ వ్యక్తి కాదా?



సీరియల్

ఓ కవిత కథ

బి. వి. ఆర్. బాబు

(గత సంచిక తరువాయి)

మళ్ళీ ఊరికి వెళ్ళే ముందురోజు సత్యం మాస్టారు గారింటికి వచ్చాడు. వాకిట్లో నుండే "మాస్టారూ" అని కేక వేశాడు.

వాకిట్లో కూర్చొని ఏదో పుస్తకం చదువుకొంటున్న కవిత, తలెత్తి చూసి "లోపలికి రా సత్యం" అన్నది.

"ఫరవాలేదు మాస్టారు లేరా" అక్కడ్నుంచే ప్రశ్నించాడు.

"ఉన్నారు" అని చెప్పి "నాన్నా నీ కోసం సత్యం వచ్చాడు" గట్టిగా పిలిచింది.

రాఘవయ్యగారు లోపల్నుంచి వచ్చి "లోపలికి రావోయ్" అన్నారు.

"ఫరవాలేదు లెండి మాస్టారూ. మీ కిప్పుడేమన్నా పని వుందా ? లేకపోతే అలా వస్తారా కోవెల దాకా వెళ్ళొద్దాం" అక్కణ్ణుంచే అడిగాడు లోపలికి రాకుండా.

ఆశ్చర్యంగా చూశారు రాఘవయ్యగారు. లోపలకు వెళ్ళి చొక్కా వేసుకొని బయటకు వచ్చారు

ఇద్దరూ కలిసి ఊరి బయట ఉన్న రామాలయం వరకు వచ్చారు. ఇద్దరిలో ఎవ్వరూ మాట్లాడలేదు రాఘవయ్యగారు మాత్రం ఏదో ఆలోచిస్తూనే ఉన్నారు. ఇద్దరు ధ్వజస్తంభం అరుగు మీద కూర్చున్నారు. కొద్దిసేపు మౌనంగా గడిచిపోయింది.

సత్యమే ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ అన్నాడు. "రేపు ఉదయమే, నేను ఊరికి వెళ్తున్నాను మాస్టారూ"

> ***జరిగిన కథ : 1*** రాఘవయ్య మాస్టారు కూతురు కవిత బాల వితంతువు. స్నేహితురాలు కవితను పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు సత్యం.

"మంచిది బాబూ, బాగా చదువు. పరీక్షలు బాగా వ్రాయాలి."

"మీ రెందుకో, వెళ్ళేముందు కనిపించ మన్నారు" గుర్తు చేశాడు.

"ఓ, అదా, ఏమిలేదు. ఊరికే నే. ఆ రోజు నే నన్న మాటలకి నువ్వేమన్నా బాధ పడ్డావేమోనని అలా అన్నాను అంతే" తేలికగా నవ్వేశారు రాఘవయ్యగారు సత్యం కూడా తేలికగా శ్వాస వదిలాడు

"మాస్టారూ" తల వంచుకొని అన్నాడు సత్యం రాఘవయ్యగారు ఏమీ పలుకలేదు. సత్యాన్నే చూస్తున్నారు. మాస్టారు పలక్కపోయేసరికి, తలెత్తి, తన వంక చూస్తున్న మాస్టారిని చూసి మళ్ళీ తల దించుకొన్నాడు

"నా మీద మీకు నమ్మకముంది గదా మాస్టారూ" అప్పటికి ఏమీ పలకలేదు రాఘవయ్యగారు.

జేబులోంచి ఓ కాగితం తీశాడు సత్యం. ఆశ్చర్యంగా అతన్నే చూస్తున్నారు రాఘవయ్యగారు.

"ఇది నేను కవితకు రాసిన ఉత్తరం మాస్టారూ" సత్యం కొనసాగించాడు. "దీన్ని ముందు మీరు చదవండి మాస్టారూ! చదివి ఇందులో కాని, ఇది కవితకు ఇవ్వడంలో కాని, నే నేమి పొరపాటు చెయ్యడంలేదన్న అభిప్రాయం మీకు కలిగితే ఇది కవితకు యివ్వండి మాస్టారూ. అంతే నేను కోరేది. ఇది కవిత కివ్వకూడదనే అభిప్రాయం మీకు కలిగితే, ఆ విషయం కూడ కవితకు చెప్పకండి. దీన్ని కాల్చిపారేస్తారో, చించిపారేస్తారో మీ యిష్టం" తలవంచుకొనే ఆ కాగితాన్ని మాస్టారు చేతిలో ఉంచాడు.

కాగితం మడత విప్పబోయారు రాఘవయ్యగారు.

"ప్లీజ్, మాస్టారూ, ఇంటికి వెళ్ళిన తరువాత చదువండి. రేపు ఉదయం వెళ్ళేటప్పుడు మీకు కనిపిస్తాను. ఈ ఉత్తరం కవితకు ఇచ్చిందీ, లేనిదీ మాత్రం తెలియజేయండి. దీనికి సమాధానం మాత్రం నాకిప్పుడే అవసరంలేదు. నిదానంగా ఆలోచించుకొని, నేను పరీక్షలయిపోయాక నెలవలకి వస్తానుగదా అప్పుడు చెప్పండి" చెప్పడం ముగించాడు.

తరువాత కొద్దిసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది. గంభీరంగా మాట్లాడుతున్న


మీ పొలాలకు
సాటిలేని పోషణ
ఇవ్వండి.
గ్రోమోర్
28-28-0
వాడండి.
అది మీకు సాటిలేని
దిగుబడులు
ఇవ్వడం చూడండి.
GROMOR
UREA AMMONIUM PHOSPHATE
28 28-0
గ్రోమోర్ 28-28-0
coromandel
gromor
కోరమాండల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్
చేనుకు చేవ, రైతుకు రొక్కం- గ్రోమోర్
FDSH CFL-762D

సత్యం వంక, ఆశ్చర్యంగా చూస్తున్నారు రాఘవయ్యగారు. అతని మొహంలో కపటం ఏమీ అగుపించలేదు. ఏదో నిశ్చయానికి వచ్చినట్లుగ అతని ముఖం ప్రశాంతంగా, తుఫాన్ వెలిసిన తర్వాత సముద్రంలా, నిశ్చలంగా ఉంది.

తరువాత కొద్దిసేపు ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు.

"ఇక వెళ్ళామా మాస్టారూ"

ఇద్దరూ లేచారు. మౌనంగా నడక సాగించారు రాఘవయ్యగారు ఇంట్లోకి వెళ్ళే ముందు మళ్ళీ సత్యమే అన్నాడు.

"మీ సమాధానం, ఎలాంటిదైనా, విని తట్టుకోగల గుండె ధైర్యం నాకుంది మాస్టారూ. ఒకవేళ మీరు ఇచ్చే సమాధానం నాకు ఆశాభంగం కలిగించేదిగా ఉన్నా, నిర్మొహమాటంగా తెలియచెయ్యండి మాస్టారూ అయితే ఇప్పుడు కాదు. నేను మళ్ళీ వచ్చినప్పుడు"

అంతవరకు నిశ్శబ్దంగా ఉన్న మాస్టారు 'అలాగే' అనేసి ఇంట్లోకి వెళ్ళిపోయారు. ఇంటిదారి పట్టాడు సత్యం.

* * *

మర్నాడు ఉదయం ఎనిమిది గంటలప్పుడు సత్యం వచ్చాడు. చేతిలో సూట్‌కేసున్నది. ఊరికి వెళుతూ, దారిలో మాస్టారుగారింటికి వచ్చాడు. వాకిట్లోనే నిలబడి 'మాస్టారూ' అని పిల్చాడు.

'ఆఁ, వస్తున్నాను' అంటూ, అతని కోసమే ఎదురు చూస్తున్నట్టుగా, లోపలికి

వెళ్ళి చొక్కా వేసుకొని వచ్చారు మాస్టారు.

"ఆ ఉత్తరం..." అంటూ ఏదో చెప్పబోతున్న సత్యం మాటని మధ్యలోనే తుంచేశారు.

"అలా వెళ్తూ మాట్లాడుకుందాం పద" అంటూ ముందుకు నడిచారు. మౌనంగా ఆయన్ని అనుసరించాడు. రోడ్డుకు చేరుకోవటానికి ఒక అరమైలు దూరం నడవాల్సి ఉంటుంది. ఇద్దరూ నిశ్శబ్దంగా కొద్దిసేపు నడిచారు.

"ఆ వుత్తరం చదివారా మాస్టారూ" మళ్ళీ అడిగాడు సత్యం.

"ఆఁ" ముభావంగా వుంది మాస్టారి సమాధానం.

"మరి..." ఆపైన అడగలేదు మీరే అర్థం చేసుకోండి అన్నట్లుగా.

"ఇంకా కవిత కివ్వలేదు. కానీ ఇచ్చేముందు నిన్నోమాట అడగాలి"

"అడగండి మాస్టారూ"

"ఆ ఉత్తరం రాసేముందు బాగా ఆలోచించుకున్నావా? ఆలోచించుకొనే ఆ ఉత్తరం వ్రాశావా? ఈ విషయం మీ యింట్లో వాళ్ళకి తెలిస్తే ఎంత బాధపడతారో ఆలోచించావా? అపుడు నీ కోసమే మేము వల వేశామనే మాట మా మీదకు వచ్చే అవకాశం ఉంది తెలుసా? దీనివల్ల తరువాత వచ్చే పరిణామాలు ఎంత భయంకరంగా ఉంటాయో ఆలోచించావా? ఈ ఉత్తరం నా చేతికి ఇచ్చిందాకా నీకు వేరే ఆలోచన రాదు. కానీ, తరువాత, అంటే రాత్రి ఆలోచించావా? పోనీ ఇప్పుడైనా ఆలోచించి, బస్సు వచ్చేలోపల చెప్పు. ఈ ఉత్తరం కవిత కిమ్మంటావా? ఇమ్మంటే ఇస్తాను. నాకేమీ అభ్యంతరంలేదు."

రాఘవయ్యగారి కంఠంలో కోపం లేదు. బాధ లేదు. ఆనందం లేదు. ఆశ్చర్యం లేదు. తన స్నేహితుడికి, హితవు చెబుతున్నట్టు ఉంది ఆయన కంఠస్వరం.

సత్యం ఏమీ మాట్లాడలేదు మళ్ళీ మాస్టారే అందుకున్నారు.

"మీరు యువకులు—యువక రక్తం మీది. మీకు ఆవేశం ఎక్కువ. ఆలోచన తక్కువ. ఈ మాట నేను నిన్నుద్దేశించి అంటున్నది కాదు. సాధారణంగా యువకుల గురించి ఉండే అభిప్రాయాలు ఇవి. మీరు తప్పు దారిలో నడవబోయినప్పుడు సరిదిద్దే బాధ్యత పెద్దలమైన మా మీద ఉంది. కానీ ఇప్పుడు నువ్వు నడవాలనుకొంటున్న దారి తప్పని నే ననడంలేదు. కానీ ముళ్ళబాటని చెపుతున్నాను. మీ లాంటి యువకులు ఒకటిగా కలిస్తే, ఆ ముళ్ళను ఏరివేయవచ్చు. అందుకు అందరూ సిద్ధంగా ఉంటేనే అది సాధ్యమౌతుంది. లేకపోతే ఆ ముళ్ళను ఏరివేయడం నీలా ఒక్కడివల్ల మాత్రం కాదు. నీ నిర్ణయాన్ని మార్చుకోమని నే ననడం లేదు. కానీ మళ్ళీ ఆలోచించుకొని చెప్పమంటున్నాను. బాగా ఆలోచించుకో"

ఆ తరువాత ఇద్దరిలో ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు రోడ్డు దగ్గరికి వచ్చేశారు. దూరంగా బస్సు కనిపించింది. బస్సు వచ్చి ఆగింది. బస్సువైపు కదులుతూ అన్నాడు సత్యం.

"ఆ ఉత్తరాన్ని కవిత కివ్వండి మాస్టారూ." అనేసి, ఇంక ఆ వైపు చూడకుండానే బస్సు ఎక్కేశాడు. బస్సు కదిలి వెళ్ళిపోయింది. భారంగా నిట్టూర్చి ఊరివైపు నడిచారు రాఘవయ్యగారు.

* * *

మధ్యాహ్నం రెండు గంటలయి ఉంటుంది. ఇంట్లో కూర్చొని కవిత ఏదో పుస్తకం చదువుకొంటున్నది. రాఘవయ్యగారు వాకిట్లో కుర్చీలో పడుకొని ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఇంతలో "కవితా" అన్న తండ్రి పిలుపు విని "ఏమిటి నాన్నా" అంటూ వచ్చింది.


"చేమ ఆకు తో పారోలీ"

కావలసిన వస్తువులు :— చేమఆకు 15 కట్టలు, శెనగపప్పు 2 పావుకిలో, ఉల్లిపాయలు 4, ఎండు మిర్చి 25, కరివేపాకు ఒక కట్ట, ఆవాలు ఒక చెంచాడు, మినప్పప్పు 3 చెంచాలు, జీలకర్ర ఒక చెంచాడు, ఉప్పు!

తయారుచేయు విధానము :— మొదట శెనగపప్పును నానబెట్టాలి. అది నానాక, దానిని బాగా కడిగి, గట్టిగా మెత్తగా రుబ్బుకోవాలి. శెనగపప్పు రుబ్బేటప్పుడు, అందులో ఎండుమిర్చి ఉప్పు, వేసి మరీ రుబ్బాలి. ఆ తర్వాత, చేమ ఆకుకి కాడలు తీసేసి, చేమ ఆకును మాత్రమే, సన్నగా తరుగుకోవాలి. ఉల్లిపాయలను కూడా సన్నగా, చిన్న చిన్న ముక్కలుగా తరుగుకోవాలి. ఆ తర్వాత, స్టౌ మీద వెడల్పాటి గిన్నెనుంచి, అందులో మరి కాస్త నూనెను పోసి కాచి, అందులో మినప్పప్పూ, ఆవాలూ, జీలకర్ర, కరివేపాకు, ఎండుమిర్చి ముక్కలు, వేసి పోపు వేయించాలి. పోపు బాగా వేగేకా, అందులో ఈ రుబ్బుకున్న శెనగపిండినీ, చేమ ఆకునూ, వేసి, బాగా కలిపి, మూతబెట్టి ఉడకనివ్వాలి. మధ్య మధ్యన కలుపుతూండాలి. కొద్దిసేపటికది ఉడికీ, చక్కగా పొడిపొడిగా అవుతుంది. ఈ "చేమ ఆకు పారోలీ" చాలా రుచిగా ఉంటుంది.

జి. రామలక్ష్మి, (హైదరాబాద్)

అసలైన సిసలైన గ్లాక్సోస్-డి® ఒక్కటే. దానిని తయారుచేసేవారు గ్లాక్సో.



® రిజిష్టర్డ్ ట్రేడ్‌మార్క్‌ను ఉపయోగించే వారు.

గ్లాక్సోస్-డి, విటమిన్ డి₂, భాస్వరము మరియు కాల్షియంతో పరిపుష్టంచేయబడిన శుద్ధమైన గ్లూకోసుగల, అత్యంత విశ్వసనీయమైన ఉత్పాదన. లక్షలాది ప్రజలు తక్షణ శక్తికోసం, గ్లాక్సోస్-డిని తీసుకుంటారు. గ్లాక్సోస్-డి, వివిధ ఆహార పదార్థాల ఉత్పాదనలూ, ప్రాణరక్షణకు వాడేమందు తయారుచేయడంలో ప్రఖ్యాతిగాంచిన గ్లాక్సో వారిచే తయారుచేయబడినది

గ్లాక్సోస్-డి®

గ్లాక్సోవారి వస్తువు

నాణ్యతలేని నకిలీ వస్తువులను చూసి మోసపోకండి — అవి మీ కుటుంబములోని వారి ఆరోగ్యానికి హానికరం కావచ్చు.

మీరు కొనే గ్లాకోస్-డి ప్యాకెట్ అసలైనదని నిర్ధారణ చేసుకోండి,

dCr/GL/35 N. Tel.

వో కవిత కథ

"ఒక గ్లాసు నీళ్ళు తీసుకురామ్మా"

లోపలికి వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెచ్చి ఇచ్చింది. గ్లాసు కోసం అక్కడే నిలబడింది.

"నా చొక్కా జేబులో ఒక కాగితం వుంది. ఇటు తీసుకురా" అన్నారు రాఘవయ్యగారు. తండ్రి మాటకు ఏమీ అర్థంకాక, మౌనంగా వెళ్ళి ఆ కాగితం తెచ్చి యిచ్చింది. దాన్ని అందుకుంటూ "ఇది నీకు వ్రాసిన ఉత్తరమే నమ్మా, సత్యం నీకు ఇమ్మన్నాడు."

"నాకా!" ఆశ్చర్యంగా అడిగింది.

"అవునమ్మా, నీకే"

తండ్రి చేతుల్లోంచి ఆ ఉత్తరం తీసుకొని లోపలికి వెళ్ళింది, సత్యం వ్రాశాడా? ఏం వ్రాసి ఉంటాడు. ఉత్తరం మడతలు విప్పింది. ఆమె కళ్ళు అక్షరాల వెంబడి పరుగులు తీశాయ్.

కవితా!

ఈ విధంగా ఉత్తరం రాస్తున్నందుకు ఏమీ అనుకోకు. నీతో ఈ విషయమే, మాట్లాడదామని చాలాసార్లు ప్రయత్నించాను. కానీ వీలు పడలేదు. అందుచేత ఈ విధంగా ఉత్తరం రాయవలసి వచ్చింది.

ఈ పుత్తరం ముందుగా మాస్టారుగారు చదివే నీ కిచ్చి వుంటారు. నేనే అలా చెయ్యమన్నాను ఈవుత్తరం నీకు మాస్టారు గారు ఇచ్చారంటే, ఇది రాయడంలో నా తప్పు ఏమీ లేదనే అర్థం.

మన మిద్దరం చిన్నప్పటినుంచీ కలిసి మెలిసి తిరిగాం. ఆడుకున్నాం. పాడుకున్నాం. మధ్యలో వచ్చిన నీ పెళ్ళి కూడా మన స్నేహాన్ని ఏమీ అడ్డు పెట్టలేకపోయింది. అలాంటి మన స్నేహాన్ని, మన బంధాన్ని ఈనాడు లోకం, మన చుట్టూ ఉన్న సమాజం అడ్డు పెట్టగలుగుతున్నది. అందుకు కారణం నీకు భర్త, నాకు భార్య లేకపోవడమే. మన ఈ అనుబంధాన్ని జీవితాంతం మాయని బంధంగా ఉంచుకుందామంటాను నేను. అందుకు నువ్వేమంటావ్.

నిన్ను చేసుకోబోయే ముందు నేను చాలా ఆలోచించాలని నువ్వంటావేమో. కానీ, అన్నీ ఆలోచించే, పోయినసారి నిన్ను చూసినప్పట్నించీ ఉప్పొంగుతున్న నా మనస్సును, నా హృదయాన్ని ఇన్నాళ్ళూ మథించి, చివరకు ఈ నిర్ణయానికి వచ్చాను. ఇందులో ఒప్పుకోవల్సిన వాళ్ళు నువ్వు, మాస్టారూ, మా తల్లిదండ్రులు.

మా తల్లిదండ్రులను ఒప్పించడం కష్టమని నాకు తెలుసు. కానీ ఎలాగో కష్టపడి వాళ్లను ఒప్పించగలనన్న నమ్మకం నాకుంది. ఒకవేళ వాళ్ళు ఒప్పుకోకపోయినా, వాళ్లను ఎదిరించి ఐనా నిన్ను చేసుకోగల ధైర్యం, గుండెనిబ్బరం నాకున్నాయి. అప్పుడైతే కొంచెం ఆలస్యమౌతుంది. నాకు వుద్యోగం వచ్చేదాకా ఆగవలసి ఉంటుంది. అందుకు నేను సిద్ధమే.

మాస్టారుగారి విషయమంటావా? ఈ పుత్తరం మాస్టారుగారి చేతినుండి నీ చేతికి వచ్చిందంటేనే మాస్టారుగారికి ఏమీ అభ్యంతరం లేదనే అర్థం.

పోతే ఇక ఒప్పుకో వలసిన దానివి నువ్వు ఒక్కతివే నువ్వు ఒప్పుకోకపోతే దేవదాసు లాగా తయారౌతాననో, ఆత్మహత్య చేసుకుంటాననో భయపడి నువ్వు ఒప్పుకోనవసరం లేదు. నీ నిర్ణయం చెప్పడానికి నీకు చాలా గడువు అంటే షుమారు నాలుగు నెలలు గడువు యిచ్చాను. నువ్వు నిదానంగా ఆలోచించుకొని, మనసు పూర్తిగా ఇష్టమైతేనే నీ అంగీకారాన్ని తెలియపరచవచ్చు నీ సమాధానం నాకు ఆశాభంగం కలిగించేదిగా ఉన్నా నిర్మొహమాటంగా చెప్పాలి.

ఇట్లు,
సత్యం.

ఉత్తరం చదవడం ముగించింది కవిత. ఆమె మెదడంతా మొద్దుబారిపోయినట్లుంది. మళ్లీ ఉత్తరమంతా చదివింది. అంతా అయోమయంగా వుంది తను మళ్ళీ పెళ్ళి చేసుకోవడమే...ఛ అనుకొంది, అదేదో పాపం అయినట్లుగా. కానీ మళ్ళీ మనసు ఇటువైపు తిరిగింది. ఏం...నువ్వుమాత్రం ఎందుకు చేసుకోకూడదు...ఆమె వయసు ప్రశ్నించింది. 'ఛ...తప్పుకదూ' ఆమె మనసు సమాధానం.

"ఇందులో తప్పేమిటి? నీవయసు వాళ్ళంతా పెళ్ళిచేసుకోవడంలేదూ? నీకు మాత్రం ఏంతక్కువ. నీగ్రహచారం కొద్దీ మీబావమ్మ కోసం నీపెళ్ళి చేశారు. చేసిన ముచ్చట తీరకుండానే మీ మామయ్య చనిపోయాడు. అది నీతప్పుకాదుగా" ఎదురు ప్రశ్న వేసింది ఆమె వయసు.

"కానీ, భర్త చనిపోయిం తరువాత మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చునా ?"

(32వ పేజీ చూడండి)

* సినిమావిశేషాలు *

కర్ణుడు పాత్రను తెలుగులో ఎవ్వరూ పోషించలేదు గనక రామారావు చేసేది మిగతావారికి మార్గదర్శి అవుతుంది

గీతోపదేశం !

"దాన వీర శూర కర్ణ" చిత్రంలో గీతోపదేశం హైలైటుగా వుంటుంది. భారత గాధలోని ముఖ్య ఘట్టాలన్నీ "దాన వీర శూర కర్ణ"లో వుంటాయి. ఈ చిత్రానికి కొండవీటి వెంకటకవి రచనా భాగాన్ని, పెండ్యాల సంగీతాన్ని, కన్నప్ప ఛాయా గ్రహణ చాతుర్యాన్ని సమకూరుస్తున్నారు.

బాలకృష్ణ అభిమన్యకుమారుడు

"ఫ్యూచర్‌హోప్"గా ఎందరో ఆశిస్తున్న చిరంజీవి బాలకృష్ణ "దాన వీర శూర కర్ణ" చిత్రంలో అభిమన్యకుమారుడుగా నటిస్తున్నారు.

కార్యదీక్షపరుడు, దక్షతతో సాధించగల ప్రజ్ఞావంతుడు అగు ఎన్టీఆర్ "దాన వీర శూర కర్ణ" చిత్రాన్ని తరతరాల ప్రేక్షకులు మెచ్చే విధంగా రూపొందించగలరు.

మహేష్ కథలకు నాయకుడు

దిన, వారఫలాలు లిఖించే జ్యోతిష్కుడు, "అనగనగా ఒక తండ్రి, ముగ్గురు మూర్ఖులు" చిత్రాల నిర్మాత అగు మహేష్‌గారిని, యిటీవల వారి ఆఫీసులో కలిసినప్పుడు, రెండు కథలను రెడీ చేసిన నిజాన్ని వెల్లడించారు.

"ముగ్గురు మూర్ఖులు" చిత్రాన్ని జూన్ 18న విడుదల చెయ్యదలచినట్టు చెప్పి, జులై నుంచి ఒక చిత్రాన్ని, సెప్టెంబరు నుంచి మరొక చిత్రాన్ని ప్రారంభించనున్నట్టు పాఠకులకు తెలపమన్నారు.

ఇద్దరు మూర్ఖులు !

ఒక చిత్రం పేరు 'ఇద్దరు మూర్ఖులు' అని, యింకొక చిత్రం పేరు "గంగ ... యమున ... సరస్వతి" అని మహేష్ చెప్పారు. రెండు చిత్రాలకు సత్యనారాయణ నాయకుడన్నారు.



'నేరం నాదికాదు ఆకలిది'లో రామారావు, త్యాగరాజు

సత్యానికి ఒక చిత్రం

పరిశ్రమతో [illegible] బతుకుతున్న మనిషి, సత్యాన్ని [illegible] మనిషి, వృత్తిని నమ్మి జీవిస్తున్న మనిషి, అందరికీ కావలసిన మనిషి, ప్రతి మంచిపనికి ముందుండే మనిషి, పేరులో సత్యాన్ని యిముడ్చుకున్న మనిషి అయిన జైహింద్ సత్యానికి, మానవతావాదాన్ని, ప్రేమవాదాన్ని నమ్మే అక్కినేని మాట యిచ్చారు. "ఒక చిత్రం పని చేస్తానని.'

అక్కినేని ... సత్యంగార్లకు వృత్తిరీత్యా సంబంధమేగాక, దగ్గరి బంధుత్వంకూడా వుంది "జైహింద్" సత్యంగారి ఆధ్వర్యంలో, అక్కినేని నటించే చిత్రానికి, సత్యంగారి అల్లుడు, అక్కినేనికి ఆత్మీయుడు అయిన తాతినేని రామారావు దర్శకుడుగా పనిచేస్తారు.

ప్రభ జాతకమ్ !

"నీడలేని ఆడది" చిత్రం తరువాత విడుదలయిన ప్రభ చిత్రాలు ఆర్థికంగా విజయాన్ని సాధించలేకపోయినా, నటిగా పేరు పొందడంలో ముందంజ వేస్తూనేవుంది.

"నటసమ్రాట్" ఆశీర్వాదబలం, షావుకారు జానకి యిచ్చిన ప్రశంసాబలం ప్రభలో వుత్సాహాన్ని పెంచి, మంచి పాత్రలు మాత్రమే చెయ్యాలన్న సంకల్ప బలానికి దారితీసింది.

భానుమతి పాత్ర !

"నటరత్న" దర్శకత్వం వహిస్తూ, నిర్మిస్తున్న "దాన వీర శూర కర్ణ" వర్ణ చిత్రంలో ప్రభకు భానుమతి పాత్ర (సుయోధన సార్వభౌముని అర్ధాంగి) రావడం, ఆమె కలలోకూడా వూహించని సంఘటనగా ప్రభ పేర్కొంది.

దుర్యోధనుడుగా రామారావు, భానుమతిగా ప్రభ పాల్గొనే ప్రేమ గీతంతో రామకృష్ణ సినీ స్టుడియోస్ ప్రారంభమైంది

త్రిపాత్రాభినయం !

"దాన వీర శూర కర్ణ" చిత్రంలో ఎన్టీఆర్ వైవిధ్యం వున్న మూడు అపురూపమైన పాత్రలను పోషిస్తున్నారు. కృష్ణుడు పాత్ర, దుర్యోధనుడు పాత్ర రామారావుగారికి అద్వితీయమైన కీర్తిని తెచ్చిపెట్టాయి.

ముఖ్యంగా కృష్ణుడు అంటే .. ఒక్క రామారావును మాత్రమే మన ప్రజలు అంగీకరించేంతగా ఆ పాత్రలో రాణించారు.

(మరెవ్వరినీ ఆ పాత్రలో చూడడానికి మన ప్రేక్షకులు యిష్టపడరన్న నిజం నాగేశ్వరరావుకు తెలుసుగనుకనే, కృష్ణ పాత్రను వలదన్నారు.)



'దేవుడు చేసిన బొమ్మలు'లో ఒక దృశ్యం





'మొనగాడు'లో జయసుధ, శోభన్‌బాబు

ఆల్బం చెప్పిన నిజం !

"తిరపతి" చిత్ర నిర్మాత హనుమాన్‌ప్రసాద్ "దేవుడు చేసిన బొమ్మలు" చిత్రాన్ని నిర్మించడంతోబాటు దర్శకత్వాన్ని కూడా నిర్వహిస్తున్న నిజాన్ని పాఠకులకు తెలిపి అయిదారు వారాలయింది.

"దేవుడు చేసిన బొమ్మలు" చిత్రం షూటింగు విజయవాడలో పూర్తిచేసి, మే మూడవ వారంలో హనుమాన్‌ప్రసాద్ మదరాసు కొచ్చారు.

ప్రసాద్‌గారిని రషస్ చూపిస్తారా అని అడిగాను. ఫైనల్ ఎడిటింగు అయింతర్వాత చూపిస్తాను అని చెప్పి, ఫోటో ఆల్బంను చూపించారు

వంద పేజీలున్న ఆల్బంను చూశాను. స్టిల్సును బట్టి నేనొక నిర్ణయానికి వచ్చాను "బరువయిన కథ. . బలీయమైన సంఘటనలు.. బలమైన సన్నివేశాలు" వున్నాయి గనక, "దేవుడు చేసిన బొమ్మలు" అందరికీ నచ్చే చిత్రం కాగలదనిపించింది

జయసుధ . ప్రభ... అనిత !

"దేవుడు చేసిన బొమ్మలు" చిత్రంలో జయసుధ . ప్రభ. . అనిత ప్రధాన పాత్రలను పోషించారు . పురుష పాత్రలను మురళీమోహన్.. గిరిబాబు చలం పోషించారు. ఒక ముఖ్య భూమికను కొమ్మినేని ధరించారు

ప్రధాన పాత్రధారులందరూ హనుమాన్ ప్రసాద్‌గారి దర్శకత్వాన్ని బలేగా పొగుడుతున్నారు. ప్రేక్షకులు అదే మాటంటే ప్రసాద్ ఆనందానికి అవధులుండవు.

ఆగస్టు నుంచి మరో చిత్రం

"దేవుడు చేసిన బొమ్మలు" చిత్రాన్ని జులైలో విడుదల చేసి, ఆగస్టు నుంచి మరొక చిత్రాన్ని ప్రారంభించబోతున్నట్టు హనుమాన్‌ప్రసాద్ చెప్పారు.

ఆ చిత్రంలో జయసుధ. . మురళీమోహన్ ముఖ్య జంటగా నటిస్తారు.

బాబు ఇంటర్నేషనల్ !

ఈ ఏడు మదరాసులో వెలసిన మరొక నూతన చిత్ర నిర్మాణ సంస్థ. ఈ సంస్థను చిట్టిబాబు . వెంకటేశ్వరరావు కలిసి స్థాపించారు.

ఏడడుగుల అనుబంధం

బాబు ఇంటర్నేషనల్ నిర్మిస్తున్న చిత్రానికి యిడిన పేరిది. కథ...మాటలను మద్దిపట్ల సూరి రాస్తున్నారు.

(నేడు ప్రఖ్యాతి వహించిన రచయిత లెవ్వరికీ తీసికట్టుకాదు సూరి. సినిమా వర్గ రాజకీయాలకు బలి అవుతున్న ఎందరో ప్రతిభావంతుల్లో మద్దిపట్ల గారు ఒకరు అన్నది యీ విలేకరి అభిప్రాయం.)

లక్ష్మీదీపక్ దర్శకత్వం !

"ఏడడుగుల అనుబంధం" చిత్రానికి చిత్రానువాదం, దర్శకత్వంను లక్ష్మీదీపక్ నిర్వహిస్తున్నారు. (మనకున్న మంచి దర్శకుల్లో దీపక్ ఒకరన్న నిజాన్ని ప్రేక్షకులు అంగీకరించగలరు.)

"ఏడడుగుల అనుబంధం" చిత్రంలో షావుకారు జానకి . . జయచిత్ర . ప్రభాకరరెడ్డి యిప్పటికి ఎంపికయిన తారాగణం.

జడ్జిగారి కోడలు !

సూర్యశ్రీ పిక్చర్స్ అన్నపూర్ణా స్టుడియోస్‌లో ఆరంభించిన చిత్రానికి "జడ్జిగారి కోడలు" అని పేరిడినట్టు, మదరాసులో వున్న ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ రఘు చెప్పారు.

రెండు పెద్ద షెడ్యూల్సులో "జడ్జిగారి కోడలు" చిత్రం పూర్తయ్యేవిధంగా నిర్మాత రామకృష్ణ ప్లాన్ చేశారు.

జడ్జిగా క్యారెక్టర్ యాక్టర్ సత్యనారాయణ, ఆయన కోడలుగా జయప్రద నటిస్తున్నారు

హీరోగా రామకృష్ణ నటిస్తున్న యీ చిత్రంలో రాజబాబు, కృష్ణకుమారి, మాడా, కె. వి. చలం సహ తారాగణం.


విజయ చిత్రాల దర్శకుడుగా రెండు దశాబ్దాల చరిత్రను సృష్టించుకున్న విక్టరీ మధుసూదనరావు దర్శకత్వాన్ని, మహదేవన్ సంగీతాన్ని, సత్యానంద్ రచన్ను, జి. వి సుబ్బారావు కళను నిర్వహిస్తున్న "జడ్జిగారి కోడలు" చిత్రాన్ని అన్నపూర్ణా ఫిలింస్ విడుదల చేస్తారు కెమరామెన్ రామకృష్ణకు యీ కొత్త పదవి మంచిని చెయ్యగలదు.

'కంటికి కాటుక—ఇంటికి ఇల్లాలు'లో పద్మశ్రీ సరోజాదేవి, జమున





'మనిషి రోడ్డున పడ్డాడు'లో విజయబాబు, జయసుధ



'ధర్మం దారితప్పితే'లో జయ ఉష

సినిమా

జ్యోతి తర్వాత జయసుధ ?

''జ్యోతి'' చిత్రం జయసుధ నట జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది అనే చెప్పాలి.

''జ్యోతి'' పాత్రను వాణిశ్రీ లాంటి మహానటి మాత్రమే పోషించగలదన్న అభిప్రాయం యీ విలేకరికి ఏర్పడింది, (చిత్రం చూచేముందు.)

తీరా చిత్రం చూశాక, జయసుధ జ్యోతి పాత్రకు ప్రాణంపోసింది అనిపించింది. ''పిట్ట కొంచెము ... కూత ఘనము'' అనెడి సామెతను నిజం చేసింది, సుధ.

''జ్యోతి'' తర్వాత జయసుధకు తెలుగు మార్కెట్టులో గ్యారంటీ ఏర్పడింది. ఈ అమ్మాయిని నమ్మి, ఎంత పెద్ద వేషం అయినా యివ్వొచ్చు అనెడి సదభిప్రాయం పరిశ్రమవాసులకు ఏర్పడింది.

'శీలానికి శిక్ష'లో శారద



వెరైటి చిత్రాల నాయిక

జయసుధ ఎంతటి లక్కీస్టార్ అంటే ... ఆమెకు వచ్చిన పాత్రలన్నీ ఒకేరకం గాక ... వెరైటీ వున్నవి గావడం.

''జ్యోతి'' చిత్రానికి, ''అల్లుడొచ్చాడు'' చిత్రానికి ఎంత తారతమ్యం వుందో, ''రాజావెడలె'', ''మొనగాడు'' చిత్రాలకు అంత వ్యత్యాసంవుంది.

''దేవుడు చేసిన బొమ్మలు'' చిత్రంలోని పాత్రకు, ''సీతమ్మ సంతానం'' చిత్రంలోని పాత్రకు సంబంధం దూరం అనిపిస్తుంది.

''రాజా'' చిత్రంలో గ్లామర్ క్వీన్‌గా జయసుధ యువతరాన్ని ఉత్తేజపరచగలిగితే, సత్య చిత్రలో ప్రేక్షకుల సింపతీని అందుకుంటుంది.

దాసరి చిత్రంలో జయసుధ

అగ్ర దర్శకుడు దాసరి రూపొందించే చిత్రాలలో అగ్రశ్రేణి నటి జయసుధకు తగిన పాత్ర లేని కారణంగా, ఎక్కువగా కలిసి పని చెయ్యడం జరిగిందికాదు.

''తిరపతి'' చిత్రం తరువాత, ''ఓ మనిషీ, తిరిగిచూడు'' చిత్రంలో జయసుధకు సరయిన వేషాన్ని, యిచ్చారు దాసరి.

శ్రీ దిడ్డి శ్రీహరిరావు నిర్మిస్తున్న ''ఓ మనిషీ, తిరిగిచూడు'' చిత్రానికి మన ప్రధాని ఇందిరమ్మ సృష్టించిన యిరవైసూత్రాల పథకం మూలాధారం.

ఈ చిత్రంలో ముగ్గురబ్బాయిలు, ముగ్గురమ్మాయిలు వున్నారు. అబ్బాయిల తల్లిగా ''ఆంధ్రా నిర్మల'' నటిస్తోంది. ఆమె కుమారరతనాలుగా మోహన్‌బాబు, ఈశ్వరరావు, మురళీమోహన్ నటిస్తున్నారు.

''ఓ మనిషీ తిరిగిచూడు'' చిత్రంలో జయసుధ, కె. విజయ, హైద్రాబాదునుంచి ఒక కొత్తమ్మాయి ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు.

హైదరాబాదులో జరిగే జూన్ షెడ్యూలుతో చిత్రం షూటింగు విభాగం పూర్తవుతుందన్న వార్తను నిర్మాత శ్రీహరిరావు చెప్పారు.

నవసమాజ నిర్మాణానికి దోహదం చెయ్యగల కథావస్తువును కథకుడు దాసరి ఎంపిక చేసినందుకు ప్రేక్షకులతోబాటు ప్రభుత్వంకూడా అభినందించక మానదు.

శ్రీదేవి ఎలావుంది ?

విజయభాస్కర్ పిక్చర్స్ వారి ''పాడవోయీ... భారతీయుడా'' చిత్రంలో శ్రీదేవి నాయికగా నటిస్తున్న వార్త పాఠకులకు తెలుసు.

శ్రీదేవి భవిష్యత్తు బాగానే వుండగలదన్న అభిప్రాయాన్ని దర్శకుడు దాసరి వ్యక్తపరచడంతో వూరుకోక, రవి శంకర్ పిక్చర్స్‌లో కూడా హీరోయిన్ పాత్ర నిచ్చినందుకు, ఆ అమ్మాయి ఎన్ని కృతజ్ఞతలయినా చెప్పాలి, మరి.

(30వ పేజీ చూడండి)

'ఒకదీపం వెలిగింది'లో రంగనాథ్, చంద్రకళ



లాక్మే వానిషింగ్ క్రీం



**మీదారి పొడవునా
చూపుల తోరణాలే**



చూపుల వయులులో మైమరచి
పొండి. లాక్మే వానిషింగ్
క్రీం మీ చర్మాన్ని అందంగా—
తాజాగా వుంచుతుంది.
మృదువుగా, సహజంగా,
మేకప్‌కు ఆదర్శవంతమైన
ఆధారం లాక్మే వానిషింగ్ క్రీం.
మీ సౌందర్య పోషణ
మా ఏకైక ఆశయం.

లాక్మే

లాక్మే లావెండర్ టాల్క్

పరిమళ సౌరభం... ఫ్రెంచివారి అనుభూతిపై



లాక్మే లావెండర్ టాల్క్
రాసుకోండి. అసలైన
ఫ్రెంచి లావెండర్ యొక్క
అపురూపమైన,
లావణ్య సువాసన.
లాక్మే లావెండర్
టాల్క్



dCA/L-VC-LT/1-J TEL.

౹త అమ్మిద గంటలక ముహూర్తం.

కన్యాదాత గంగాధరంగారి మండువా యిల్లు చాలా సందడిగా వుంది

ముత్తయిదువులు పట్టుచీరలు కట్టుకుని పనేమీ లేకపోయినా సరదాకొద్దీ అటూ యిటూ తిరుగుతూ వివాహానికి విచ్చేసిన బంధువుల్లో తమకు తెలిసినవాళ్లు వుంటే పరామర్శించుతూ హడావుడి చేస్తున్నారు ఒకవైపు వంటలు అవుతున్నాయి కన్యాదాత తన కనిష్ట పుత్రిక విజయ వివాహపు ఏర్పాటులు ఘనంగా చేయటానికి కారణం తను యిలాంటి శుభకార్యం జరిపించటం యిదే చివరిసారి కాబట్టి

ఆ గ్రామములో గంగాధరమే పెద్దరైతు. మరొక విధంగా చెప్పాలంటే ఉన్నత భావాలు గల వ్యక్తి గంగాధరం. ఆ గ్రామాన్ని అభివృద్ధి చెయ్యటానికి కృషి చేసి అనతి కాలంలోనే రెండు మైళ్ల దూరంలో వున్న బస్తీని కలుపుతూ తారురోడ్డు వేయించాడు. స్త్రీకయినా పురుషుడికయినా చదువు ముఖ్యమని భావించిన గంగాధరం కొడుకు శేఖర్‌ని కూతురు విజయను గ్రాడ్యుయేట్లు చేశాడు.

ఎప్పటినుంచో ఎలిమెంటరీ స్కూలుగానే వుండిపోయినదాన్ని బోర్డు స్కూలుగాను: హైస్కూలు కాక జూనియర్ కాలేజీని కూడా స్థాపించటంలో కృతకృత్యుడయ్యాడు: ఆ గ్రామానికి పెద్దగా, ఎవరికేకష్టం వచ్చినా ఆర్థికంగా ఆదుకొనుట — గ్రామంలో ఏ తగాలు వచ్చినా పోలీసు కేసుదాకా వెళ్లకుండా పంచాయతి క్రిందనే పరిష్కరించేవాడు అలా గ్రామాభ్యుదయాన్ని కాంక్షించే గంగాధరం అంటే ప్రతీ ఒక్కరికీ గౌరవం తన కిప్పట్లో వివాహం వద్దని ఎం ఏ చదివేందుకు యూనివర్శిటికి వెళ్లిన కూతురు విజయకి పట్టుబట్టి తాను కావాలనుకున్న తన మేనల్లుడు శ్రీధరానికిచ్చి వివాహం చెయ్యబోవటం.అతనికి తాను తప్ప ఎవరూ లేకపోవటంతో అటు బంధువులు లేకపోయినా యిటుబంధువులుతో పందిరినిండిపోయింది.

జరీ ఉత్తరీయాన్ని అటూ యిటూ సర్దుకుంటూ వస్తున్న పెద్దలను, మున్సిపల్ కమీషనరు నుంచి రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వరకూ వచ్చినవాళ్లను సాదరంగా ఎదురు వెళ్లి ఆహ్వానించి తీసుకువచ్చి వివాహానికని అందంగా అలంకరించిన విశాలమయిన కొత్త తాటియాకుల పందిరిలో వేయించిన కుర్చీలలో తీసుకువెళ్లి కూర్చోపెట్టటం గంగాధరం వంతు అయితే శేఖర్ కల్యాణ మండపందగ్గిర ఏర్పాటులు దగ్గిర వుండి పర్యవేక్షించటం; శ్రీధర్ మిత్రులు కూడా రావటంతో లగ్న సమయానికి పందిరి నిండిపోయింది

ముహూర్తం సమీపించేసరికి బ్యాండుమేళంతో పెళ్లికొడుకు అలంకరణతో శ్రీధర్ కల్యాణ మండపంలో అడుగు పెట్టటంతో అప్పటివరకూ అక్కడ కూర్చుని లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్న వాళ్ళల్లా నిశ్శబ్దం వహించి కల్యాణ మండపంవంక చూస్తుండిపోయారు.

"అతనే పెళ్లికొడుకు !..."

"ఫారిన్ రిటర్న్‌డ్‌ట !..."

"డాక్టరా ?. ."

"కాదు !. . ఇంజనీయర్ !..."

"కట్నం ఎన్నివేలు ?"

"ఆయన మేనల్లుడే ! అతనే కావాలని ఆ అమ్మాయిని చేసుకుంటున్నాడట. ఆస్తికూడా చాలా వున్నదట ఇంకా కట్నం దేనికి ?"

"ఎంత అదృష్టవంతురాలు ?" తన ముందు కుర్చీలో కూర్చుని నెమ్మదిగా చెప్పుకుంటున్న వాళ్ల మాటలు విని అనుకుంది పెళ్లిగాని అమ్మాయి. కట్నం సమస్యవల్లనే తనకి వివాహం కావటం లేదన్నదే ఆమె బాధ.

"కట్నాల రేటు అంతరిక్షానికి ఎగ్రపాకుతున్న యీ రోజుల్లో ఎగివాడు కావాలని చేసుకోవటం అంటే ఆశ్చర్యపడవలసిన విషయం !" అనుకుంది మరొకామె.


"చిన్నప్పటేనుంచీ మేనరికమని యిద్దరికీ అనుకున్నారట ఒకేచోట పెరిగారట. కాని విజయ మేనత్త కోరికలు హిరణ్యాక్ష వరాలుకి తట్టుకోలేక అప్పుడు జరగలేదు ఆమె చనిపోయిన తరువాత జరుగుతోంది !" గంగాధరంగారి దూరపు బంధువు పక్కనామె అడిగినదానికి నెమ్మదిగా చెప్పింది.

"అలాగా !"

"పెళ్లికూతురు ! ... పెళ్లికూతురు !"

లోపలివైపుకు చూస్తూ పురోహితుడు కేకలు వేస్తున్నాడు శేఖర్ భార్య జానకి — ఆ కేకలు విని హడావుడిగా కాటుక కనిపించలేదని హడావుడి పడిపోతూ అలమర - డ్రస్సింగ్ టేబుల్ సొరుగులన్నీ వెతకసాగింది

టేబుల్‌మీద తల ఆన్చుకుని కళ్లు మూసుకుని దీర్ఘాలోచనలో పడిపోయిన విజయ భుజంమీద చెయ్యి పడటంతో కళ్లు విప్పింది. విప్పిన రెప్పలతో పాటు కన్నీరుకూడా చెంపలమీదుగా జారి ముంజేతిని వున్న గాజులమీద పడి లైట్ల వెలుతురులో తళుక్కున మెరిసినవి అది చూసిన జానకి చలించి పోయింది అంతలోనే తనను తాను సర్దుకునిఅంది—



"అదేమిటి విజయా ! తప్పకదూ ?" ఏమీ తెలియనట్లే అంది మందలింపుగా.

"ఏడుపుకాక జీవితానికి యింకేమి వుంది వదినా ?"

"ఛా ! ఛా ! అలా బాధపడకు విజయా ! శ్రీధర్ లాంటి యోగ్యుడు నీకు భర్తగా లభించటం నీ అదృష్టం !"

"అన్నీ తెలిసే అలా అంటున్నావా వదినా ?"

"మర్చిపోలేదు! కాని మర్చిపోవాలి. తప్పదు విజయా! మీ అత్తయ్యకి డబ్బుమీద వున్న వ్యామోహం అలా దారి తప్పించిందిగాని శ్రీధర్ కేమి లోటని?"

"వదినా?"

విసురుగా కుర్చీలోనుంచి లేచి నిలబడింది విజయ. ఆడబిడ్డలోని విసురుపాటుని చూసి జానకి తెల్లబోయింది. అదేమీ గమనించే స్థితిలో లేదు విజయ.

"అత్తయ్య మూర్ఖత్వమేకాదు వదినా! బావ పిరికితనం! చేతకానితనం! అప్రయోజకత్వం! అత్తయ్య వుండగా నన్ను చేసుకుంటానికి ధైర్యం లేనివాడు, అత్తయ్య చనిపోయిన తరువాత వచ్చిందా ధైర్యం? బావ ఎంత మంచివాడో నాకు తెలుసు! ఆ మంచితనం వెనుక ఎంత విషం దాగివున్నదో?"

విజయ మాటలకు అడ్డువస్తూ "ఉష్!" అంది పెదాలమీద చూపుడువేలు వుంచుకుని. చాలామంది బంధువులున్నారు. గోడకి చెవులుంటాయని అంచెలంచెలుగా చెవులు కొరుక్కుంటారని జానకి భయం.

విజయ కన్నీరు వేలితో తుడుస్తూ నెమ్మదిగా అంది — "ఎంత బాధ వున్నా సమయానుకూలంగా మనసులోనే యిముడ్చుకోవాలిగాని వెల్లడించుకున్నందువల్ల ఏమయినా ఫలితం వుంటుందా? ఎల్లవేళలా ఆవేశం పనికిరాదు విజయా! అయిపోయినదేదో అయిపోయింది. శ్రీధర్ మనసా వాచా కోరుతున్నాడు. అతన్ని కాదనటం మంచిది కాదు. మరో అరగంటలో అతని సొత్తు కాబోతున్నావు. సంతోషంగా వుండాలి!" విజయ మనస్తత్వం తెలిసిన జానకి సన్నిహితంగా చెప్పటంలో కూడా నేర్పు వహించింది.

"సంతోషమా వదినా? ఎక్కడనుంచి వస్తుంది? నన్ను కాదన్న బావ మరలా నన్ను చేసుకుంటున్నాడని సంతోషమా? అర్జెంటుగా రమ్మనమని టెలిగ్రాం యిచ్చి రప్పించి అన్నీ సిద్ధంచేసుకుని నాతో మాటమాత్రంగానైనా చెప్పకుండా యీ పెళ్లి చేస్తున్నారనా?"

"విజయా?" వారింపుగా జానకి పిలిచింది.

"నేనెంత అభిమానవంతురాలినో? నాకెంత పౌరుషం వుందో? నేను పెరిగింది ఏ పరిసరాలలోనో నీకూ తెలుసు వదినా! ఒకసారి నన్ను కాదన్న బావని చేసుకుని అతనితో కాపురం చెయ్యలేను!" ఆవేశంతో తల విదిలించుకుంది.

"నిన్ను కాదన్నది నీ మేనత్తగాని అతను కాదుకదా?" బుగ్గన కాటుకతో కళ్యాణపుచుక్క పెడుతూ అంది.

"బావకూ..."

గుమ్మంలో అడుగుల చప్పుడు వినిపించి చెప్పబోతున్న విజయ ఆగి ఆవైపుకి చూసింది. గంగాధరం, పురోహితుడు నిలబడివున్నారు. తల వంచుకుంది.

"ఏమ్మా జానకీ! యింకా ముస్తాబు కాలేదా?"

తండ్రి గంభీర విగ్రహం; అంతకంటే గంభీరమయిన వాక్చాతుర్యంముందు తిరిగి మాట్లాడే ధైర్యం ఆ గ్రామంలో వాళ్లకి లేనట్లే యింట్లో వాళ్లకి కూడా లేదు. విజయ తల వంచుకుని కూర్చుంది అసహనంగా.

"అయిపోయింది మావఁగారూ! కాటుక భరిణ కనిపించక ఆలస్యమయింది. విజయదేమీ ఆలస్యంలేదు!" అంది జానకి.

ఇంతలో శాంతమ్మ బంధువర్గాన్నంతటినీ పలుకరించి విజయ ముస్తాబు ఎంతవరకు వచ్చిందో చూసేందుకు వచ్చింది నవ్వుకుంటూ.

"నీ కిప్పటికి తీరుబడి అయిందన్నమాట? అమ్మాయి ముస్తాబు కోడలికి అప్పగించి నువ్వు పెత్తనాలు చేస్తున్నావన్నమాట!" భార్యవంక చూస్తూ అన్నాడు.

"వయస్సు పిల్లలకి వయస్సువాళ్లు చేసే ముస్తాబు ఏం నచ్చుతుంది? నేను చేద్దామన్నా ముసలి చాదస్తాలు అంటూ నన్ను ఓ ప్రక్క కూర్చోబెట్టి మీ అమ్మాయే చేసుకుంటుంది. ఆవతల బంధువులనయినా పలుకరించినట్లుంటుందని అలా వెళ్లానండీ!"

"సరే! సరే! తొందరగా తెమిలి విజయను తీసుకురండి!" అంటూ గంగాధరం పందిరిలోకి వెళ్లిపోయాడు. ఆయన్ని అనుసరించింది శాంతమ్మ. కాటుక అయిన వేలిని తలకు రాసుకుంటూ విజయని రెప్ప వాల్చకుండా రెండు క్షణాలు అలాగే చూస్తూ వుండిపోయింది జానకి. వదినగారలా చూడటంతో సిగ్గుపడింది విజయ.

"నిన్ను ఈ అలంకరణలో చూస్తుంటే నాకే తగని వ్యామోహం కలుగుతోంది. యింక శ్రీధర్‌కి కలగటంలో ఆశ్చర్యం లేదు! అందుకే ఏరీ కోరీ నిన్నే కావాలని అడిగి మరీ చేసుకుంటున్నాడు!"


"పో వదినా?" పెళ్లికూతురుగా సిగ్గుపడింది. శ్రీధర్ భార్య కాబోతున్నానని గుర్తుకు వచ్చి కుంచించుకుపోయింది.

"ఆ విశాలమయిన నేత్రాలలో తన ప్రతిబింబం అనుక్షణం చూసుకోవచ్చునని బంగారు తీనుతున్న నీ చెక్కుటద్దాలమీద!"

"వదినా? నీ ఊహాగానం యింతటితో ఆపుతావా లేదా?..."

విజయ రౌద్ర స్వరూపం చూసి జానకి తెల్లబోయింది. ఎలాగో అలా గతాన్ని మరిపించాలని జానకి చేస్తున్న ప్రయత్నాలన్నీ విఫలమయినవి. విజయ కోపం — పట్టుదల ఎలాంటివో జానక్కి తెలియనిది కాదు. సెలవల్లో యింటికి వచ్చినప్పుడు బెడ్‌కాఫీ పనిమనిషి ఆలస్యంగా తెచ్చినదని తిప్పి పంపేసింది. పనిమనిషి వచ్చి చెప్పగా తను తీసుకు వెళ్లింది. ఎంత బ్రతిమాలినా ఆ పూట అసలు కాఫీయే త్రాగలేదు.

"నువ్వు ఊహించినవన్నీ అసంభవాలే వదినా? జరగనిది! జరగనిది!" పళ్లు నూరుకుంటూ లేచి నిలబడింది. తండ్రి మరలా గది గుమ్మం దగ్గరకు రావటంతో నొసలు చిట్లించుకుని చూపు మరో



సరోజినీదేవి

వైపుకి తిప్పుకుంది. కొబ్బరిబొండాం ఆకులు పక్కలు విజయ దోసిలిలో పెట్టింది జానకి.

"త్వరగా రావాలి!" తొందర చేశాడు గంగాధరం.

జానకి విజయ చెయ్యి పుచ్చుకుని గది గుమ్మం దాటి రెండడుగులు వేసిన తరువాత జానకి విజయ చెయ్యి వదిలేసి ఆగిపోయింది. ఒకడుగు ముందుకు వేసిన విజయ ఆగి తల తిప్పి జానకివంక చూసింది. ఎర్రవారి వున్న విజయ కళ్లను చూసి జానకి మనసు ఆక్రోశించింది. అక్కడ వుండి విజయ కళ్లల్లోని ఎరుపుని చూడలేక అక్కడ వుండలేక తొందరగా వెనక్కి తిరిగి గదిలోకి వెళ్లిపోయింది మరో ముత్తయిదువు విజయ సిగ్గుపడుతోందనుకుని లేచి విజయను తీసుకువెళ్లి పెళ్లిపీటలమీద కూర్చోబెట్టింది అప్పటికే దుప్పటి అడ్డుగా ఆ పక్క నొకళ్ళు ఈ పక్క నొకళ్ళు పట్టుకుని నిలబడ్డారు. పురోహితుడు చదివే మంత్రాలమీద విజయ దృష్టి లేదు. మనసంతా బాధతో అక్కసుతో నిండిపోయింది. వాళ్లిద్దరిమధ్యా అడ్డుపెట్టబడిన ఆ దుప్పటే లేకపోతే చూపులతో శ్రీధర్‌ని నమిలి మింగివేసేది ఈ పాటికి. శ్రీధర్ మనసులో గతమేమీలేదు. వాటిని గురించి ఆలోచించటమే లేదు. విజయతో తాను గడపబోయే వైవాహిక జీవితం గురించి మధురంగా ఊహించుకుంటున్నాడు. విజయ తన హృదయ సౌందర్యరాణిగా, తనను పరిపాలించే సామ్రాజ్ఞిలాగా ఊహించుకుంటున్నాడు.

విజయ చేతిలోకి జీలకర్రా బెల్లం కలిపిన ముద్దను పురోహితుడు యిచ్చి ఆమె చెయ్యిని దుప్పటి క్రింద నుంచి ఎత్తి శ్రీధర్ తలమీద పెట్టించి మంత్రాలు చదువుతూ శ్రీధర్ చేతిలో బెల్లం జీలకర్రా వుంచి విజయ తలమీద పెట్టించి బిగ్గరగా మంత్రాలు చదువుతూ భజంత్రీలు అని అరిచాడు. ఒక్కసారే వాయిద్యాలన్నీ మిన్నుముట్టేలా మ్రోగాయి. రెండు నిముషాలు అక్షింతలజల్లు ఒక్కసారే వర్షంలా కురిసి వెలిసిపోయింది దుప్పటి అడ్డు తీసేశారు. అప్పటివరకూ అడ్డుగోడలా వున్న దుప్పటి తీసేసరికి ఎంతో రిలీఫ్‌గా ఫీలయ్యాడు శ్రీధర్ చాలాకాలమయింది శ్రీధర్ విజయను చూసి ఇప్పుడెలా వుందన్న ఆత్రుతతో కొంచెంగా వంచుకున్న తలను తొందరగా ఎత్తి విజయవంక చూశాడు విజయ వంచిన తల ఎత్తలేదు ఆమె ముఖభావాలు చూడాలని ఆశపడినా చూడలేక పోయాడు మధ్య మధ్యలో విజయ కర్చీఫ్‌తో ముక్కు తుడుచుకోసాగింది. ఎందుకో అర్థంకాలేదు శ్రీధర్‌కి జలుబు చేసిందేమో ? అనుకున్నాడు యథావిధిగా పెళ్లి తంతు జరిపిస్తున్నారు పురోహితులు. వారేది చెప్పితే అదే యాంత్రికంగా చేస్తోందేతప్ప శ్రీధర్ వంక కన్నెత్తి చూడలేదు మధుపర్కాలు కట్టుకుని మరలా యిద్దరూ పక్కపక్కలనే కూర్చున్నారు. మంగళసూత్రాలను విజయ, శ్రీధర్ పసుపు కుంకుమలతో పూజ చేస్తున్నప్పుడు గంగాధరం సంతృప్తిగా శ్వాస వదిలారు

వివాహపు తంతుకంటే విజయ దుఃఖాన్ని చూడవలసివస్తుందని గదిలో వంటరిగా కూర్చుని బాధపడుతోంది జానకి. తననెవరూ గమనించకుండా వుండేందుకు తలుపులు దగ్గరకు చేర్లవేసుకుని తలుపు పక్కనే గోడకి ఆనుకుని కూర్చుంది.

"మాంగల్యం తంతునానేన మమజీవన
హేతునా కంఠే బధ్నామి శుభగే త్వంజీవ
శరదం ..శతం.. శతం..."

మంత్రాలతోపాటు బ్యాండుమేళం ఆగకుండా మ్రోగటంతో మిగతా మంత్రాలు జానక్కి వినిపించలేదు. మంగళసూత్రధారణ అయిపోయింది. భగవంతుడా! విజయ దాంపత్యజీవితం మూడు పువ్వులు ఆరుకాయలుగా ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా కాపాడమని మనసులోనే కంటికి కనిపించని దేవుడిని వేడుకుంది జానకి. విజయ మనస్తత్వం తెలిసిన జానక్కి నమ్మకంలేదు. తాను ఆశించినంత తొందరగా విజయ తన మనసుని మార్చుకుంటుందని!! ఎందుకొబ్బరిచిప్పలకోసం వచ్చిన శేఖర్ తాటాకు బుట్టలో వున్న చిప్పలను రెంటిని తీసుకుని వెనక్కి తిరిగేసరికి తలుపువారగా జానకి కూర్చునివుంటం చూసి ఆశ్చర్యపోతూ —

"నువ్వా జానకీ ?" అన్నాడు దగ్గరగా వచ్చి.

"ఆఁ ..." కంగారుగా లేచి నిలబడింది.

రాత్రి

చిక్కని చీకటి రాత్రి
చీకులు చికాకులు లేని రాత్రి
పసిపాపలు హాయిగా ఆదమరచి నిద్రించే రాత్రి
పగవాడి పరుషవాక్కులు వినపడని రాత్రి
సమస్యలు సాధింపులు లేని రాత్రి
విదిలింపులు విసుగుదలలు లేని రాత్రి
ఎలా ఉన్నా ఏం చేసినా ఎవరూ చూడని రాత్రి
ఏడ్చినా నవ్వినా ఎవరికీ తెలియని రాత్రి
అందుకే రాత్రంటే నాకు అంతులేని సుఖం
పగలంటే భరించలేని భయం

— చినబాబు

"అందరూ పెళ్లి చూస్తూ పందిరిలో వుంటే నువ్విలా చాటున దాక్కున్నావేమిటి ?" కొంచెం కోపంగానే అడిగాడు

"ఏమండీ ?" ఆపైన చెప్పలేకపోయింది.

"అసలేమయిందో చెప్పు జానకీ ?" ఆలస్యాన్ని భరించలేనట్లు విసుగ్గా మొహం పెట్టాడు.

"విజయ మాటలు ప్రవర్తనా; పడుతున్న బాధా చూస్తుంటే నాకేమిటో భయంగా వుందండీ ?" చెమర్చిన కళ్లను తుడుచుకుంది జానకి.

అప్పటివరకూ విసుగ్గా వున్న శేఖర్ జానకి బాధపడుతున్న తీరు చూసి చలించిపోయాడు. ఏదో కారణం వుంటేనేగాని జానకి బాధపడదని తెలుసు అయినా ఆ సమయంలో ఆలోచించలేకపోయాడు. అయినా విజయ మామూలుగానే వుండి పెళ్లిపీటల మీద మూడు ముళ్లూ ఎలాగో పడిపోయాయి విజయకేమున్నా బాధగా వుంటే సర్దుకుంటుందన్న నమ్మకం అతనికి వుంది. ఆ నమ్మకంతోనే భార్య పడుతున్న వేదనను చాలా తేలికగా తీసుకున్నాడు అసలు శేఖర్ తత్వమే అంత! ఎంత సీరియస్ విషయాన్నయినా తేలికగా తీసుకోవటం అతని మనస్తత్వం.

"నువ్వు ఊహించినంత తెలివితక్కువదేమీ కాదు విజయ! నాలుగు రోజులు గడిస్తే వాళ్లిద్దరినీ చూసి నువ్వే నవ్వుతావు. మనలో ఒకడిగా మెలిగిన వాడు శ్రీధర్. ఈ నాలుగేళ్లనుంచేగా దూరంగా వున్నది ? అనుకోని అవాంతరాలు వచ్చాయి. అత్తయ్య చనిపోయిననాడే అవీ ఆమెతోనే పోయాయి. పెళ్లిపీటలమీద నీ మందమతి చూసి నేనూ అలాగే బాధపడ్డాను కాని నాలుగు ఆకులు నాకంటే ఎక్కువే చదివావని మొదటి రాత్రే తెలుసుకున్నాను. మీ ఆడవాళ్లంతా యింతే! పద! పద! పెళ్లి చూద్దువుగాని!" అంటూ జానకి చెయ్యి పట్టుకుని లేవతీసి హాలువరకూ తీసుకొచ్చి అక్కడే వొదిలి తొందరగా పందిరిలోకి వెళ్లాడు. వరండాలో నిలబడింది జానకి

"వరకట్నాలేమయినా చదివించుతారా ?" పురోహితుడు బిగ్గరగా కేక వేయటంతో అప్పటి వరకూ ఆనంద పారవశ్యంతో మునిగివున్న గంగాధరం తొందరగా లేచి పైపంచెను సవరించుకుంటూ అన్నాడు.

"తూర్పువైపున వున్న ఎనిమిది ఎకరాల మామిడితోట..."

మధ్యలో అందుకున్న శ్రీధర్ "మామయ్యా! ఏమిటి ఈ కట్నాల చాదస్తాలు ?... కట్నం కోసమా నేను విజయను చేసుకునేది ?... నాకేమీ వద్దు. నేను కోరిన వరం ప్రసాదించావు. అది చాలు!"

శ్రీధర్ గంభీరంగా అంటూంటే పందిరిలోని వాళ్లు శ్రోతలే అయ్యారు. "తనను లోబర్చుకొనుటకు యిదొక ఎత్తు!" కసిగా అనుకుంది విజయ గంగాధరం శ్రీధర్ అభిప్రాయాన్ని ఖండించబోయాడు అది అర్థం చేసుకున్న శ్రీధర్ మేనమామను వారించుతూ అన్నాడు —

"క్షమించు మామయ్యా! నా నిర్ణయం మారదు!"

ఆశ్చర్యపోయారు అందరూనూ. గంగాధరం యింకేమీమాట్లాడలేకపోయాడు. ముత్తయిదువుల్లో మరలా దీన్నిగురించిన చర్చ చెలరేగింది అంచెలంచెలుగా

"అదృష్టమంటే అలా వుండాలి! కట్నం లేకుండా తప్పిపోయింది."

"ఆ అమ్మాయి పూర్వజన్మలో ఎన్ని నోములు నోచిందో ?"

అందరి మొహాలు హర్ష పులకింతలతో వెలిగిపోతున్నవి తమకీ యిలాంటి మేనల్లుడు వుంటే బాగుండుననుకుంటున్నారు లేనివాళ్లు

ఉన్నవాళ్లు, కట్నాలు లాంఛనాలని సవాలక్ష కోరికలు కోరుతున్నారు అని తిట్టుకోవటంతో విజయా శ్రీధర్‌ల వివాహ కార్యక్రమం పూర్తయింది వధూవరులు బ్రహ్మముడులతో లేచి గౌరీపూజ దగ్గరకు బోతుంటే యిద్దరికీ వరుస అయినవాళ్లు పేర్లు చెప్పమని గుమ్మం అవతలే నిలబెట్టేశారు. విజయకి యీ పద్ధతి అసలు నచ్చలేదు. ఏమనేందుకూ బాగోదు శ్రీధర్

ప్రారంభం!

మాత్రం విజయ కళ్లల్లోకి చూడాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు. పేర్లు చెప్పమని కన్నెపిల్లల వత్తిడి ఎక్కువ అయింది. శ్రీధర్ ముందుచెప్పి విజయవంక చూశాడు. విజయకి చెప్పే వుద్దేశ్యం లేదు. విసుగ్గా అటుయిటుకుదిలించు కుంటోంది. వీళ్లందరినీ తప్పించుకోవాలంటే యిద్దరి చెంగులూ కలిపి ముడివేశారు. అది గ్రహించిన జానకి పేరు చెప్పమని బలవంతం చేస్తున్నవాళ్లని కోప్పడి యిద్దరినీ లోపలకి తీసుకు వెళ్లింది. ఆ తరువాత గౌరీదేవి దగ్గర పూజ అయిన తరువాత ముడులు విప్పారు. గదిలోకి వచ్చింది విజయ.

"సమయానికి ఆదుకుని పుణ్యంకట్టుకున్నావు వదినా! పేర్లు చెప్పాలట. పేర్లు? ఎందుకు యీ ముసలి ఆచారాలన్నీను!"

"వేడుక అంటారు యిలాంటివాటినే! అయినా అతని పేరు చెప్పినంతమాత్రాన నీ నోటి ముత్యాలు రాలిపోతాయా ఏమిటి?"

"నా కిలాంటివి గిట్టవు!" అంది చిక్కులు పడ్డ పసుపుతాడును సరిచేస్తూ.

విజయ ఊహ తెలిసినప్పటినుంచీ శ్రీధర్ అనే పిలిచేది. "బావ" అనాలి అని ఎన్నోసార్లు తల్లితండ్రులు మందలించేవారు. వయస్సు వచ్చిన తరువాత "బావ" అనటం నేర్చుకుంది. అదయినా ఎవరిముందయినా; ఎవరూ లేకపోతే శ్రీధర్ అనే పిలిచేది. విజయ ఎలా పిలిచినా మధురంగానే వుండేది శ్రీధర్‌కి. తన పేరు ఉచ్చరిస్తున్న అందమయిన విజయ పెదాల కదలికను ముద్దుగా; అపురూపంగా చూసుకునేవాడు శ్రీధర్.

2

వివాహానికి దగ్గిర దూరపు బంధువుల్లు వాళ్లు కూడా వెళ్లిపోయారు. స్తంభాలకి కట్టిన కొబ్బరి ఆకులు; పందిరికి వేసిన తాటాకులు ఎండి; పచ్చి ఎండిన వాసన వస్తోంది. గంగాధరంగారింటిలో ఎప్పటి సఖ్యతే గాక అదనంగా కొత్తల్లుడి హోదాతో శ్రీధర్ ప్రవేశించటంతో కొన్ని మార్పులుకూడా కొత్తవి జరిగాయి. మేనమామ గారింటిలో తనకి జరుగుతున్న విపరీతమయిన మర్యాదలకు తట్టుకోలేకపోతున్నాడు.

నాలుగేళ్లుగా రెండు కుటుంబాల మధ్య సఖ్యత లేదు. తానయి బంధుత్వాన్ని కలుపుకున్న శ్రీధర్‌కి యీ మర్యాదలు అంతగా యిష్టం లేకపోయినా ఎవరితో చెప్పితే ఏమనుకుంటారోనని బాధపడేవాడు. శేఖర్, శ్రీధర్‌లు ఒకే ఈడు వాళ్లయినా బావా అంటూ మేనత్త కొడుకని శ్రీధర్‌ని గౌరవించే మాట్లాడేవాడు. టిఫిన్, కాఫీలు, భోజనాలన్నీ ముగించుకుని నాలుగు యిళ్లవతల వున్న తనింటికి వచ్చేసేవాడు పడుకుంటానికి. అలా రాత్రిళ్లు రావటం ఆ ఇంటి నౌఖరు వయస్సు మళ్లిన అబ్బిగాడికి యిష్టం వుండేదికాదు. అలాగని ముఖంమీద అడగనూ లేకపోయేవాడు.

ఈ రాత్రికి యిక్కడే పడుకోమని అంటా రేమోనని ఎదురుచూసేవాడు శ్రీధర్, ఏ రోజు కారోజు వెళ్లబోయేముందు. అందుకని మరో అరగంట అక్కడే శేఖర్‌తో బాతాఖాని వేసుక్కూర్చునేవాడు. తనకి నిద్ర వస్తుంటే లేచేవాడు వెళ్లేటందుకు. ఉండమని ఎవరి నోటి నుంచీ రాకపోయేసరికి అసహనం కలిగేది శ్రీధర్‌కి. పెళ్లి పీటలమీద కనిపించిన విజయ ఆ తరువాత కనిపించలేదు. కనిపిస్తే మాట్లాడాలని శ్రీధర్ చేసిన ప్రయత్నమంతా వృధా అయ్యేది. మామగా రింటికి రావటంతోనే అతని కళ్లు విజయకోసం నలువైపులా వెతికేవి. ఏమరుపాటుగా వున్నప్పుడు తన కెదురయితే బాగుండుననుకునేవాడు. విజయతో మాట్లాడి చాలా సంవత్సరాలు అయిందని గుర్తు చేసుకుంటూ వుండేవాడు. భోజనం చేస్తున్నంతసేపే కాక శ్రీధర్ ఆ యింటికి వచ్చినది మొదలు ఆత్రుతను; ఆరాటాన్ని కనిపెడుతున్న జానకి యింక లాభంలేదు; త్వరలో ఆ అడ్డుకాస్తా తీరిపోతే బాగుంటుందనుకుంది. నెమ్మదిగా యీ విషయం అత్తగారి చెవినకూడా వేసింది. భోజనానికే క్రిందకివచ్చే విజయ మిగతా వేళల్లో తన గదిలోనే పుస్తకాలతోనూ నిద్రతోనూ గడిపేది. తన పెళ్లి ఎలా జరిగిందో? ఎలా తాను శ్రీధర్‌తో మూడు ముళ్ళూ వేయించుకున్నదో అర్ధంకావటంలేదు విజయకే; మనసు బాగోనప్పుడు శ్రీధర్ గురించిన ఆలోచనలతో విజయ మనసు ఒక విధమయిన నిర్లిప్తతను కలిగించేది.

కూతురు వైఖరిని కనిపెడుతున్న గంగాధరం శాంతమ్మల మనసులో అలజడి వున్నా పైకి నిండుగానే కనిపించుతున్నారు. అందుకనే శోభనానికి ఏ హడావుడి వుండరాదనే బంధువుల నెవరినీ వుండమనలేదు. ఆర్భాటం లేకుండా చెయ్యాలని జానకి ఉద్దేశ్యం. తమని వుండమని అనలేదని దగ్గిర బంధువులు గింజుకున్నా లెక్కచెయ్యలేదు. ఎలాంటి హడావుడి, ఆర్భాటం లేకుండా ముగించాలని శాంతమ్మ, జానకిల ఉద్దేశ్యం.

విజయ మేడమీద తన గదిలో పడుకుని లేచే సరికి మూడు గంటలయింది. యింట్లో కొంచెం హడావుడిగా కనిపించింది. ఎందుకో ఏమిటో అర్ధం కాలేదు. రోజూ మధ్యాహ్నం "టీ" ఫ్లాస్కులో పోసి గదిలో వుంచేవారు ఫ్లాస్కు లేదుకదా; ఎవరూ కప్పు టీ తెచ్చి వుంచినట్టుకూడా లేదు. బద్ధకంగానే లేచి క్రిందకి దిగివచ్చేసరికి హాలులోనే శేఖర్ శ్రీధర్‌లు కూర్చునివున్నారు. శ్రీధర్‌ని చూడగానే విజయ కనుబొమ్మలు ముడివడ్డాయి; హాలులోనుంచి లోపలికి వెళ్లాలంటే శ్రీధర్‌ని దాటుకుని వెళ్లాలి! విజయను చూస్తూనే శేఖర్ పని వున్నదంటూ బైటికి వెళ్లిపోయాడు వెళ్లేటందుకు రెండు క్షణాలు సందేహించింది విజయ తనకోసమే ఆగిందనుకున్నాడు శ్రీధర్.

"బాగున్నావా విజయా?" నవ్వుతూ అడిగాడు. వంచుకున్న ఆమె కళ్లల్లోకి అప్పుడూ చూడాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు.

"ఆఁ.." అప్రయత్నంగా జవాబిచ్చింది. దానికే పరమానందభరితుడై పోయాడు. చేతిలోని పుస్తకం టీపాయ్‌మీద వుంచి లేచి నిలబడ్డాడు.

"క్లాసు వస్తుందని శేఖర్ అంటున్నాడు!"


"చదువులో క్లాసు వచ్చినా జీవితంలో రాలేదు." అంటూ అతన్ని తప్పుకుని లోపలికి వెళ్లిపోయింది. ఆ తప్పుకోవటంలో యిద్దరి బుజాలూ ఓ క్షణం రాసుకున్నవి. విజయ అదిగమనించలేదు గాని శ్రీధర్ తన బుజాన్ని ఆప్యాయంగా తడుము కుంటూ అలాగే నిలబడిపోయాడు. విజయ అన్న మాటలకు అర్ధాలు వెతుక్కుంటూ; అక్కడే కూర్చుని చాలాసేపు పుస్తకంలోకి చూస్తూ వుండి పోయాడు. చాలాసేపు తర్వాత శేఖర్ లోపలికి వస్తూనే వంటరిగా కూర్చున్న శ్రీధర్‌ని చూస్తూనే ఆశ్చర్యపోయాడు.

"ఇంకా నువ్వు యింటికి వెళ్లివుంటావను కున్నాను!"

"నువ్వు వస్తావని కూర్చున్నాను!"

"ఆఁ... నాకోసం కూర్చున్నందుకు నీకో మంచి శుభవార్త!"

"ఏమిటది?"



సామాన్యుని సహాయుడు

శతకోటి దరిద్రాలకి . . .

హోటేల్లో మన ఎదురుగుండా కూర్చుని మనం ఏదంటే అదీ తనకీ తెమ్మని అంటాడు – పెద్ద కాలర్ వున్న అమెరికన్ షర్టు, పొడుగు చెంప లున్న హిప్పీ జుట్టూ ధరించిన ఒక షోకిల్లా తాపీగా, మనలాగే ఆకలిగా తినేస్తాడు, మనకంటే ముందే కాఫీ జుర్రేస్తాడు లేచి అర్జంట్ పని వున్నవాడిలా పోతాడు మన కిదంతా మొదట విడ్డూరంగా వుండదు కాని ఆ శాల్తీ మరి రాదు, సర్వేశ్వరుడు మనకి బరువైన బిల్లు చేతిలో పెడతాడు అంటే ఎదుటివాడు మేసింది మనం తిన్నది కలిపి మన నెత్తిన రుద్దుతున్నాడన్నమాట ఏం చేస్తాం ? ? యిలాంటి అనుభవం జరగనివాళ్లు అదృష్టవంతులు యిది ఘరానా దొంగ వ్యవహారం మొన్ననీమధ్య మా మిత్రుడో పెద్ద మనిషి దగ్గరకి, ఒక సూట్‌వాలా చిన్న నల్ల పెట్టె చేత ధరించి, కంటికి రంగుటద్దాలు అలంకరించి వచ్చాడుట

ఇంగ్లీషు మాట్లాడాడు... మనవాడు వెంటనే కూర్చోమన్నాడు అవతలివాడు గ్రాడ్యుయేట్ నన్నాడు మావాణ్ణి తెల్లకాగితం అడిగి మావాడి కలంతోనే దానిమీద తన పేరు, కెమికల్ యింజనీరు అన్న బిరుదూ, అవీ రాసి, ఒక ప్రఖ్యాత రచయిత పేరు, మరో ప్రముఖ మంత్రిగారి పేరు చెప్పాడు మీకు తెలుసా ? అన్నాడట – మావాడు లేచి నిలబడి మరీ పరోక్షంలో వున్న తన అభిమాన రచయితకీ, మంత్రిగారిపట్ల గౌరవం ప్రదర్శించి మరీ తెలుసు నన్నాడు – అవతలి వ్యక్తి సదరు రచయిత బావమరిది తోడల్లుణ్ణి అన్నాడు కాఫీ తెప్పించాడు "నా మిత్రుడు" అవతలివాడు మంత్రిగారి అల్లుడు తన క్లాసుమేటన్నాడు– ఇకనేం కిళ్లీకూడా వచ్చింది ! వేసుకున్నాడు "కెమికల్ యింజనీరు" తాపీగా చెప్పాడుట "నేను పూనా నుంచి బెంగళూరు పోతున్నాను దారిలో నా పర్సు పోయింది అందులో కొన్ని వందల పైకముంది" అని "ప్స్ ! పోయింది పర్సేకాదు నా టిక్కెట్ కూడా అన్నాడు" నా మిత్రుడు కూడా సానుభూతిగా "ప్స్" అన్నాడు– "మీరు వో ఫిఫ్టీ సర్దండి నేను బెజవాడ వెళ్లి ఎమ్. వో చేస్తాను" అన్నాడుటతగాడు

మనవాడికి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డది అవతలివాడు చిరాకుపడుతున్నాడు యింత ఆలశ్యమా ఆఫ్టరాల్ ఏభై రూపాయలు యివ్వటానికి అన్నట్లు మొహంపెట్టి !

లేదు అనలేక "ఓ ట్వంటీఫైవ్ మాత్రం వుంది సార్" అంటూ దుఃఖాన్ని కడుపులో దాచుకుంటూ యిచ్చాట్ట అది తీసుకుని కె ఇం అపోజిట్ కాశేశ్వరరావు మార్కెట్, నియర్ పోలీసు స్టేషన్ అని తన పేరు–చిరునామా రాసియిచ్చి మరీ వెళ్లిపోయాడు బెంగళూరు అన్నావ్‌కదా బెజవాడ చిరునామా ? ఏమిటి అని అడగలేదు – కొంచెం రోజులైంది నామిత్రుడు పై ఘరానా మనిషి చెప్పిన పాపులర్ 'రైటర్ని' కలిశాడు గొప్పగా "మీవాడొకడు యిట్లా దారిలో పర్స్ పారేసుకుంటే వారికి నేను ట్వంటీఫైవ్ రుపీస్ సర్దాను" అని చెప్పాడు ఆ రచయిత అదేమిటి స్వామీ ! మీరు చెప్పిన పోలికలున్న శాల్తీ నాకు తెలియదు పైగా యీమధ్యనే మీరు చెప్పిన పోలిక లున్నవాడు నాదగ్గరికీ వచ్చాడు "నా 'ఫాన్'ని నా రచనలంటే పడిఛస్తాను" అని బంకలా పట్టుకుంటే నేనూ పదిరూపాయి లిచ్చి దండం పెట్టానే అన్నాడు ఇద్దరూ ఒకరి మొహంలోకి వొకరు చూసుకున్నారుట అదే ఆ రచయితగారు, మా మిత్రుడూ ఇద్దరి మొహాల్లోను రెండోవాడి మొహం ఒకటోరకం వెర్రివెధవలా కనపడ్డది కాబోలు అయ్యా ! అదీ సంగతి

ఇది దొంగతనమా ? ఘరానా ముష్టివాడి లక్షణమా ? సీరియస్‌గా వస్తాడో పెద్దమనిషి "మీరు మావూరు హైద్రాబాద్ ఎప్పుడు రారా ?" అంటాడు మనల్ని "ఎందుకు రామూ వొస్తాను" అంటాం మనం "అక్కడికి వస్తే ఎక్కడ దిగుతారు ?" ప్రశ్న "మా చుట్టాలున్నారు" "ఓహో ! అయితే మాయింట్లో దిగమనడం బాగుండదు" అని బోలెడు బాధపడిపోతాడు అవతలివాడు "సరే ! ఫోన్‌చేసి మిమ్మల్ని కలుస్తా మీ చుట్టంగారి 'వివరాలు యివ్వండి" అంటాడు – ఒకటోరకం వెర్రివెధవలాగా యిస్తాం అన్ని "డీటైల్సూ" మనం మీది అసలు "నెల్లూరు జిల్లావా ?" అంటాడు "కాదు గోదావరి" అంటాం "ఓహో అక్కడ మీకు పొలాలున్నాయా ? మీ తాతగారి పేరు ?" యిట్లా క్రాస్ ఎగ్జామిన్ చేస్తాడు కాఫీపోసి మరీ యీ వివరాలిస్తాం అవతలివాడు మన బుర్ర డొల్ల చేసేసినంత బోర్‌కొట్టిపోతాడు

మనం హైద్రాబాద్ కాదుగదా సూర్యాపేట దాకా కూడా వెళ్లం. ఎట్లా పోతాం మనమేం డబ్బులు బలిసి వున్నామా ? కాని కొన్నాళ్లకి మన చుట్టం లెటర్ రాస్తాడు "ఎవరో సుప్రభాతానందం అనే నీ మిత్రుడు ఇటీవల పర్స్ పారేసుకుని మా యింటికి వస్తే అతని ద్వారా నీ క్షేమ సమాచారాలు అక్కడ "పాలెం"లో గల మీ తాతగారి క్షేమ సమాచారాలుకూడా తెలుసుకున్నాం పాపం మీ మిత్రుడు రెండుపూట లుండి, ఎంతో మొహమాటంపడుతూ ఏభై రూపాయలు అడిగి తీసుకున్నాడు యిచ్చాం నీ మొహం చూసి అయినా యివ్వక తప్పదుకదా" అని అంటూ రాస్తాడు మనం ఏడుస్తామో నవ్వుతామో వేరే చెప్పాలా ? ముష్టిలో యీ ఘరానా ముష్టి యమ డేంజర్ ! అందుకనే శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలున్నాయి అంటారు విజ్ఞులు అన్నీ మనకి తెలియవుకదా అందుకే బోలా పడతాం

[వీ రా జీ]

"చెప్పకో చూద్దాం !"

"అంత తెలివి నాకెక్కడున్నదోయ్ ! సీక్రెట్టయితే ? నేను వినగలిగినదయితే చెప్పు ! నేను తొందరగా యింటికి వెళ్లాలి !" అన్నాడు శ్రీధర్

"ఇందాకటినుంచీ లేని తొందర యిప్పుడేమి వచ్చింది బావా ? టిఫిన్ చేసివెళ్లు !"

"టిఫిన్ సంగతి తరువాత ! శుభవార్త అన్నావు అదేమిటో ముందు చెప్పు ?"

శేఖర్ నవ్వుతూ జేబులోనుంచి కాగితం తీసి శ్రీధర్ చేతిలో వుంచాడు నాలుగు వైపులా పసుపు రాసివుంది మడత విప్పి చదువుకున్నాడు శోభనానికి ముహూర్తం ఆ రాత్రికే పెట్టారు యిలాంటి రాత్రికోసం తానిన్ని రోజులనుంచీ ఎదురు చూస్తున్నాడు యిప్పటికి తాను ధన్యుడయ్యాడన్నమాట ! తన ఆనందాన్ని ఏమాత్రం పైకి ప్రస్ఫుటించనీయక కాగితాన్ని మడతపెట్టి యిచ్చేస్తూ –

"థాంక్సు బావా !" అన్నాడు అతినెమ్మదిగా

"వట్టి థాంక్సేనా ?" అన్నాడు శేఖర్ నవ్వుతూ

బాంధవ్యాలు

శ్రీధర్ నవ్వి వూరుకున్నాడు ఇంతలో జానకి రెండు ప్లేటులనిండా పకోడీలు తీసుకొచ్చి యిద్దరికీ అందించింది వేడి వేడి పకోడీలు తిని టీ త్రాగుతుండగా నౌఖరు రంగన్న రావటం చూసి లేచి నిలబడ్డాడు

"మీకోసం కరణంగారు, రైతులు వచ్చి కూర్చున్నారు బాబూ !" అన్నాడు

"వచ్చేస్తున్నానని చెప్పు !"

రంగన్న వెళ్లిపోయాడు తొందరగా టీ త్రాగటం ముగించి చెప్పులు తొడుక్కుని బైటికి వచ్చి ఇంటిదారి పట్టాడు లోపలకి అడుగు పెట్టగానే రైతులు, కరణం లేచి నిలబడ్డారు వారందరినీ కూర్చోమని తనూ వారితోపాటే అరుగుమీద వేసివున్న చాపమీద కూర్చున్నాడు ఆ ఇల్లు ఆరు దూలాలది ఎప్పటిదో అది ! అరవై సంవత్సరాల క్రితం కట్టినట్లుంటుంది లోపలకి వెళ్లే దారికి అటూ యిటూ ఎత్తయిన అరుగులు వున్నాయి వాటిమీద చాపలు, చాపలకి అవతలగా రెండు పడకకుర్చీలు ఎప్పుడూ పరిచేవుంటాయి కనకదుర్గమ్మ చనిపోయిన తరువాత అవన్నీ లోపల గదుల్లో వుంచారు ఫారిన్ నుంచి శ్రీధర్ వచ్చిన తరువాత మేనమామగారింటికి వెళ్లకుండా తనింటిలోనే దిగాడు తల్లి పోయిన తరువాత రెండేళ్ల నుంచి తాళాలు పెట్టివున్న యింటి తలుపులు తెరిపించి తాను ఊహ తెలిసినప్పటి నుంచీ తమనే నమ్ముకునివున్న రంగన్నను మాత్రం వుంచుకున్నాడు తనకి వంటకోసమని పట్నం నుంచి తెప్పించుకున్న నాయర్‌తో వంట చేయించుకుని తనింటిలోనే వుంటున్నాడుగాని మేనమామగారింటికి వెళ్లలేదు సిగ్గువల్ల అది గ్రహించిన గంగధరం కూడా వత్తిడి చెయ్యలేదు మేనల్లుడికి పంట తాలూకా డబ్బు, స్థిరాస్తులన్నీ సయాపైసాతోసహా లెక్కలు చూపించి అప్ప చెప్పించాడు గంగాధరం తల్లి ప్రోనోట్లు మీద, తాకట్టులమీద వ్రాయించుకుని యిచ్చిన డబ్బు రైతుల నుంచి వసూలుచెయ్యక ఎవరి నోట్లు వాళ్లకి యిచ్చేసి తల్లికి వున్న చెడ్డపేరుని కొంచెమయినా తగ్గించగలిగాడు [ఇంకా వుంది]

డ్రీమ్‌ఫ్లవర్ తాజాతనము పరిమళం కూడా రోజంతా... మీ ఒళ్లు అంతా.



అప్పుడే స్నానం చేసిన తాజాతనం ఎన్నిగంటలైనాసరే, రోజంతా ఇల్లాగే ఉంటుంది పాండ్స్ డ్రీమ్‌ఫ్లవర్ టాల్కుతో నిర్మలంగా చల్లగా ఉండడానికి ఒళ్లంతా వేసికోండి దాని సున్నితమైన పరిమళం ఒళ్లు అంతా పట్టుకొని ఉంటుంది, ఒంటి మీది చెమ్మను పీల్చేస్తుంది పొడిగా ఉంచి ఆనందాన్ని కలిగిస్తుంది మండు వేసంకాలంలో అయినాసరే చెమట కంపు ఉండదు, ఒళ్లు అంటుకోదు అతి మృదువుగా పట్టులా ఉండటంచేత ముఖానికికూడా వాడవచ్చు. పాండ్స్ డ్రీమ్‌ఫ్లవర్ టాల్కు మీకు మీ కుటుంబానికి అవసరమైన టాల్కు.

పాండ్స్ డ్రీమ్‌ఫ్లవర్ టాల్క్

భోగకరమైన టాల్కు కుటుంబానికి పొదుపుతో



చీస్‌బ్రో-పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమిత బాధ్యతలతో యు.యస్.ఎ.లో సంస్థాపితమైనది.)

Pond's

సినిమా

(22వ పేజీ తరువాయి)

గిరిబాబు దొరతనం

దుష్టపాత్రలను పోషించే నటుల్లో గిరిబాబుకు మెజారిటీ వున్నట్టు తెలిసింది గిరిబాబు వేసేది విలన్ వేషాలే అయినా, అతగాడి నటనలో దొరతనం కనిపిస్తుంది

అరుపులు లేకుండా, వికట అట్టహాసం వెయ్యకుండా, తడిగుడ్డలతో గొంతులు కోసే విధానం గిరిబాబు నటనలో కనిపిస్తుంది

''జగమే మాయ'' చిత్రం ద్వారా ప్రేక్షకులకు పరిచయమైన గిరిబాబు నేడు జగమెరిగిన నటుడయ్యాడు

ప్రస్తుతం గిరిబాబు విలన్ పాత్రలనే గాక, హీరో పాత్రలను కూడా పోషిస్తున్న నిజాన్ని ఆయనే చెప్పారు

పూర్తయిన చిత్రాలు !

గిరిబాబు నటించిన చిత్రాలు విడుదలకు సిద్ధంగా వున్నవి యివి

మన వూరి కథ, వధూవరులు, జ్యోతి, దేవుడు చేసిన బొమ్మలు, ఒకమ్మాయి కథ, స్వామిద్రోహులు, పెళ్ళాడేబొమ్మ, పెళ్లి కాని తండ్రి, లక్ష్మి నిర్దోషి

నటిస్తున్న చిత్రాలు !

గిరిబాబు నటిస్తున్న (సెట్స్‌కు వెళ్లినవి) చిత్రాలు ఎనిమిది

మహాత్ముడు, వస్తాడే మాబావ, హీరో 77, ఉదయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్, మునసబుగారి అల్లుడు, వెలుగుబాటలు, తాళికట్టే చూడు, క్రాంతికుమార్ గారి కొత్త చిత్రం

ఏదిచ్చినా చేస్తాను !

నిర్మాత దర్శకుడు గిరిబాబు ఫలానా పాత్రకు సరిపోతాడు అని ఎంచి, తన్ను ఎంపిక చేస్తే, ఆ పాత్రకు పూర్తి న్యాయంచేసే పనిలో వెనకాడను అన్నారు గిరిబాబు

"చక్రధారి" వుంది

''క్షేత్రయ్య'' ప్రేక్షకులను నిరాశపరచడంతో, ఒక పుకారు బయల్దేరింది ఏమనో తెలుసా? అక్కినేని నాగేశ్వరరావు ''చక్రధారి''కి ''నో'' చెప్పారని

ఈ విలేఖరి విన్న మాట నిజమేనా అని ''చక్రధారి'' చిత్ర నిర్మాత అనూరాధాదేవిని ప్రశ్నించాను

ఎవరన్నారా మాట అంటూ ఒక గంభీర ధ్వని నాకు సమాధానం యిచ్చింది ఆ ధ్వని ఒకనాటి మేటి నటి కృష్ణవేణిది

ఆగస్టు 15 నుంచి ''చక్రధారి'' షూటింగు అన్నపూర్ణా స్టుడియోస్‌లో జరగడం నూరు శాతం తధ్యము అని ఆవిడ అన్నప్పుడు, గిట్టనివాళ్ళు ఎందుకిలా ప్రచారాలు ప్రారంభిస్తారో అర్థం కాలేదు యీ విలేఖరికి

కన్నడంలో ప్రజాదరణ పొందిన చిత్రం యూనివర్సల్ కధావస్తువు వున్న చిత్రం ''చక్రధారి'' తెలుగులో విజయాన్ని సాధించగలదన్న కృష్ణవేణిగారి నమ్మకాన్ని అభినందించాను లక్షలు పెట్టే చిత్రాన్ని నిర్మించే మాకు లేని సందేహం బాధ యితరులకు దేనికి అని ఆవిడ అడిగిన ప్రశ్న సమంజసం అనిపించింది

''చక్రధారి'' చిత్రంలో అక్కినేని, వాణిశ్రీ, జయప్రద, గుమ్మడి, సత్యనారాయణ, రాజబాబు, అల్లు రామలింగయ్య, ప్రభాకరరెడ్డి, కాంచన మరియు రామకృష్ణ వంటి అనుభవజ్ఞులు ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు


సంభాషణలకు ఆచార్య ఆత్రేయ, సంగీతానికి జి కె వెంకటేష్, ఛాయాగ్రహణానికి రహమాన్ సారధ్యం వహిస్తున్నారు

ఏ చిత్రాన్నయినా జనరంజకం చెయ్యగల దిట్ట, విక్టరీ మధుసూదనరావు ''చక్రధారి''ని మంచి చిత్రంగా రూపొందించడంలో విజయం సాధించగలరు

— శ్రీనివాస్



'నారద వినోదం'లో జయంతి



← 'రాజా వెడలె'లో జయసుధ


PRICES SLASHED
PRICES SLASHED
PRICES SLASHED
PRICES SLASHED
Prestige

వో కవిత కథ

(18వ పేజి తరువాయి)

"ఎందుకు చేసుకో కూడదూ? చేసుకునే వాళ్ళు చాలామంది ఊరికే ఉన్నారు. కానీ తనంతట తాను నిన్ను చేసుకుంటానని ముందుకు వచ్చాడు గదా. మరి నీ అభ్యంతరం ఏమిటి?" గద్దించింది ఆమె వయస్సు.

"నిజమేనేమో" అనుకోకుండా ఉండలేకపోయింది ఆమె మనసు. ఆరాత్రంతా కూడా కవితకు నిద్రపట్టలేదు. ఏవో ఆలోచనలతో ఎప్పుడో కలతనిదురపోయింది.

* * *

సాయంత్రం ఐదున్నర గంటలయి ఉంటుంది. సూర్యుడు పడమరవైపున, ఆరిపోయే దీపం ఒక్కసారి వెలిగి నట్టుగా అస్తమించబోతూ ఎర్రగా వెలుగుతున్నాడు. ప్రియుని కోసం విలపించే ఆడదానిలా హోరు పెడుతున్నది సముద్రం. ఆ బీచిలో. ఎన్నో జంటలు తిరుగుతున్నయ్. పిల్లలు కొందరు ఇసుకతో గూళ్ళు కట్టుకొని ఆడుకుంటున్నారు. కొంతమంది కెరటాలవద్దకు వెళ్ళి ఆడుకుంటున్నారు. వాళ్ల తల్లిదండ్రులు వాళ్ళ ధోరణిలో వాళ్ళుంటూనే ఇంకో కంటితో పిల్లల్ని జాగ్రత్తగా చూసుకుంటున్నారు. అంత కోలాహలంగా ఉన్న బీచిలో, దూరంగా సత్యం, ప్రక్కన అతని ఫ్రెండు రమేష్ ఇద్దరు కూచొని ఉన్నారు. "ఇంతకూ, నీకు కవితను పెళ్ళిచేసుకోవాలని ఉందంటావ్" అప్పటి వరకూ చెప్పిందంతా విన్న రమేష్ అడిగాడు.

అవునన్నట్లుగా సత్యం తల నాడించాడు.

"నిజమే సత్యం. నువ్వూ నీ ఆదర్శం రెండూ బాగానే వున్నాయి. నేనూ మెచ్చుకుంటాను. కానీ అందువల్ల చాలా యిబ్బందులున్నాయే. వాటిని నువ్వు తట్టుకోగలవా అని" ఆలోచిస్తూ నిదానంగా అన్నాడు రమేష్.

"ఇబ్బందులంటే మా మాస్టారు చెప్పినవేగా".

"అవేననుకో నేను మళ్లీ చెప్పాల్సిన అవసరం లేదు. కాని బాగా ఆలోచించుకొని మరీ అడుగు వెయ్యి. మీ నాన్నగార్ని కాదని బ్రతక గలవా" సీరియస్‌గా వుంది రమేష్ ముఖం.

"అందుకే గదా. ఉద్యోగం వచ్చిందాకా, ఈ విషయం ఇంట్లో చెప్పనంటున్నది. అప్పుడు నాన్నగారు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా సరే, నాకవసరం లేదు"

"ఇంతకీ కవిత ఒప్పుకుంటుందంటావా" అనుమానంగా అడిగాడు.

"ఒప్పుకుంటుందనే నా నమ్మకం. చిన్నతనం నుంచీ. నేనూ, కవితా ఎంత స్నేహంగా ఉన్నామో తెలిస్తే, నీకీ అనుమానమే రాదు" ధీమాగా ఉంది సత్యం కంఠం.

"చూడు సత్యం కవిత మీద జాలిపడి నువ్వు ఈ నిర్ణయానికి రాలేదు గదా!"

"ఛ.. ఛ.. అదేంలేదు. కవితను నాజీవిత భాగస్వామిగా ఎన్నుకొంటే నా జీవితం నిండుగా సాగిపోతుందని నా అంతరాత్మ చెబుతున్నది. అదే ఈ నిర్ణయానికి కారణం. నా నిర్ణయాన్ని మా తల్లిదండ్రులు కూడా ఆమోదిస్తారనే అనుకుందాం. మరినీవిషయం చెప్పావు కాదు."

"నా విషయం — నిజం చెప్పాలంటే నువ్వు నా స్నేహితుడవని చెప్పుకోడానికే గర్వపడుతున్నాను సత్యం. నీలాగా నేను వితంతువునే చేసుకుంటానని ప్రమాణం చేయకపోయినా, నువ్వు చేసినంతలో పదో వంతైనా, నేనూ చేస్తాను. ఈ విషయంలో నీకేం కావలసి ఉన్నా నా సహాయం ఎల్లప్పుడూ ఉంటుంది సత్యం" మనస్ఫూర్తిగా, స్నేహితుడి భుజం తట్టాడు రమేష్. ఇద్దరూ ఏదో, చాలా సేపు ఆలోచిస్తూండిపోయారు.

రమేష్ వాళ్లది చాలా సంపన్న కుటుంబం. తల్లి, తండ్రి విజయవాడ దగ్గర ఏదో పల్లెటూర్లో ఉంటున్నారు. ఒక్కడే కొడుకవడం చేత కుమారుడ్ని డాక్టరుని చేయాలనే వాళ్ల కోరిక ప్రకారమే-రమేష్ కూడా చిన్నప్పటి నుంచి, ప్రతి క్లాసులో కూడా మంచి మార్కులతో పాసవుతూ వచ్చాడు. ఇంటర్మీడియట్ అయిపోయిం తర్వాత రమేష్‌ని వైజాగ్‌లో ఎం. బి. బి. ఎస్. లో చేర్చారు. ఇప్పుడు రమేష్ ఫైనల్ యియర్ అయిపోయి హౌస్-సర్జన్ చేస్తున్నాడు. అది కూడా ఇంకో రెండు మూడు నెలలలో అయిపోతుంది.

రమేష్ వాళ్ల రూమ్మేటు సత్యానికి స్నేహితుడు. ఆ ఫ్రెండు కోసమని అప్పుడప్పుడు రమేష్ రూముకు వస్తూండేవాడు సత్యం. అప్పుడే రమేష్‌తో పరిచయం అయింది. తరువాత సత్యం మామయ్య ఇల్లు


అమ్మా,
వాళ్ళ
బాత్‌రూమునుండి
అంత చెడ్డ
వాసన వస్తుందేం,
మనదాంట్లో మంచి
వాసనేస్తుండగా?
మనం
ఓడోనిల్
వాడతాముగామరి!
ఓడోనిల్ భరించలేని దుర్వాసనలను మరుక్షణంలో దూరం చేసి
మీ మరుగు దొడ్డిని పరిశుభ్రంగా తాజా సువాసనలతో నింపుతుంది
ఓడోనిల్ అనేక సువాసనలలో లభిస్తుంది. రకరకాల సైజులలోనూ,
నమూనాలలోనూ, ప్యాక్‌లలోనూ లభిస్తుంది.
బల్సారా
—సౌఖ్యమైన జీవనానికి
అధునాతన సాధనాలు
BALSARA బల్సారా అండ్ కంపెని (ప్రై.) లి.
43, నగీన్‌దాస్ మాస్టర్ రోడ్, బొంబాయి-400 001.
CHAITRA-BLS-6 Tel

వారఫలం

మహేష్

18 6 1976 శుక్రవారం మొదలు
24-6-1976 గురువారం వరకు

మేషం:— ప్రయోజనంలేని శ్రమ కలుగుతుంది ఉద్యోగంలో కార్యభారం పెరుగు తుంది. వృత్తిలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగు తుంది. బంధు మిత్రులను కల్సుకొంటారు.

వృషభం: వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం ఆఖరులో వ్యతిరేకమైన వార్తలను వింటారు. మీ తొందరపాటు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. అధికార్యా విషయంలో అనుకూలత లభిస్తుంది.

మిథునం:— స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. ప్రయోజనంగల సంభాషణలను జరుప గలరు. సజ్జన సాంగత్యం లభిస్తుంది వ్యాపారంలో ఆదాయం పెరుగు తుంది. విద్య వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది స్త్రీలకు— దైవ కార్యాలు నెరవెరతాయి. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం:— రావలసినడబ్బు అందు తుంది. సంతోషకరమైన వార్తలను వింటారు. వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సు కొంటారు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

సింహం:— వేటిస్త్రీ అవకాశాలు కూడా జారి పోవచ్చును. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. ఆందోళనకు గురి కాగలరు. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు అనుకూలంగా ఉంటాయి. రావల సిన డబ్బు అందు తుంది. స్త్రీలకు—కుటుంబవ్యవ హారాల్లో కార్యభారం పెరుగు తుంది. అను కూలమైన వార్తలను వింటారు.

కన్య :— వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తు లను కల్సుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు బాగుం టాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది. వారం ఆఖరులో సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగ లదు. మీ ప్రయత్నాలకు ఆటంకాలు రాగలవు. స్త్రీలకు- ఆరోగ్యం బాగుండదు. వినోద కాల క్షేపాల్లో పాల్గొంటారు.

తుల: అనవసరమైన సందేహాలు కలుగు తాయి. వృత్తిలో సాటివారిపోటీ పెరుగు తుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి. భాగస్వాములతో కలిసిచేసే వ్యాపారాలు బాగుంటాయి. మీ ప్రయ త్నాలు ఫలిస్తాయి స్త్రీలకు— కుటుంబ వ్యవ హారాలు బాగుంటాయి. దైవకార్యాలు నెరవెర తాయి.

వృశ్చికం:— వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభి స్తుంది. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగు తుంది. మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

ధనుస్సు :— ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. మీ కార్యక్రమాలు హడావుడిగా వుంటాయి. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వ్యాపారంలో ఆదాయం పెరుగు తుంది. ముమ్ముందు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధిస్తారు. స్త్రీలకు — పుణ్యకార్యాలు చేస్తారు. సంతానానిక సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

మకరం:— వృత్తిలో అనుకూలమైన వార్తలను వింటారు. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది. స్థిరాస్తి వ్యవ హారాలు బాగుంటాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి

కుంభం :— మీ శ్రమకు తగిన ఫలితం లభి స్తుంది. రావలసినడబ్బు అందు తుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

మీనం :— మీ కార్యక్రమాలు బాగుం టాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది. వృత్తిలో ఆదాయం పెరుగు తుంది. ప్రయోజనం గల సంభా షణలను జరుప గలరు. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు లాభిస్తాయి. స్త్రీలకు— ఆరో గ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

మారడంతో, ఈ యిల్లు రమేష్ రూముకు ఇంకా దగ్గిర కావడంతో, సత్యం. రమేష్‌ల ఫ్రెండ్‌షిప్ గట్టిగా పెనవేసుకొని ఇద్దరూ మనసులు విప్పిచెప్పుకొనేంత సన్నిహితుల్ని చేసింది. ప్రతి ఆదివారం ఇద్దరూ కలిసి బీచ్‌కు రావడం అలవాటు అయింది.

"ఇంతకూ తరువాత ఏంచేస్తావు" అలో చనల్లోంచి బయట పడుతూ అడిగాడు సత్యం.

"చేసేదేముంది. నాన్నగారికి తెలిసిన ప్రైవేట్ నర్సింగ్ హోమ్ ఒకటి ఉంది. అందులోనే కొన్నాళ్ళు ప్రాక్టీసు చేసి, తరు వాత, వీలైతే విడిగా ప్రాక్టీసు పెట్టుకోవ డమో లేక అందులోనే ఉండిపోవడమో."

తరువాత ఇద్దరూ ఏవో విషయాలు మాట్లాడుకుంటూ, ఎప్పుడో చీకటి పడిన తరువాత ఎవరి దారి వాళ్ళు చూసుకున్నారు.

* * *

ఓ కవిత కథ

కాలం చాలా త్వరగా గడిచిపోయింది రమేష్ హౌస్ సర్జన్ పూర్తి అయిపోయింది. రమేష్ మరునటి రోజే, వూరికి పయాణ మౌతున్నాడు. ఆ రోజు సాయంత్రం స్నేహితు లిద్దరూ మళ్ళీ బీచికి వచ్చారు. ఇద్దరి గుండెల నిండా బాధ పేరుకొని ఉంది. అంతు తెలియని బాధ. ఇన్నాళ్ళు ఇద్దరూ ప్రాణ స్నేహితుల్లాగా ఉన్నారు. రేపటి నుండి ఎవరికి ఎవరో. ఇద్దరూ ఇసకలో నడచి ఒకచోట కూర్చొన్నారు. కొద్దిసేపు వారిద్దరి మధ్య మౌనంగా గడచిపోయింది.

"మళ్ళీ ఇక్కడికి ఎప్పుడు వస్తామో కదూ" నిశ్శబ్దాన్ని చీలుస్తూ అన్నాడు సత్యం. సత్యాన్ని చూస్తుంటే జాలి వేస్తున్నది రమేష్‌కు.

"అరె. ఎందుకయ్యా. అంత బాధ పడి పోతావ్. ఆడపిల్లను అత్తవారింటికి పంపే టట్లు బాధపడుతున్నావ్? హాయిగా ఈ సంబరంనుండి విముక్తి నందినందుకు సంతో షించక." నవ్వుతూ సత్యం భుజంపై చెయ్యి వేశాడు.

అలా చలాకీగా మాట్లాడుతున్న రమేష్‌ను చూస్తుంటే ఒకవైపు ఆశ్చర్యం. ఇంకోవైపు రేపట్నుంచి అతన్ని విడిచి ఉండాలనే బాధ రెండూ ఒక్కసారి సత్యం హృదయాన్ని కమ్మేశాయి.

"ఇంతకూ కవిత సంగతేం చేశావ్. మళ్ళీ ఈమధ్యేమైనా ఆమెను గురించి ఆలోచిం చావా లేక ఆరోజు నాతో చెప్పిందేనా?" ప్రసంగం మారుస్తూ అన్నాడు రమేష్.

"ఆలోచించేందు కేముంది. నా నిర్ణ యంలో మార్పేమీ ఉండదు," ధృఢంగా వుంది సత్యం కంఠం.

(ఇంకా వుంది)



Reshma
Suchitra
mysore queen
Mysore Beauty
THOMAS/DGM/875/Tel


“విష్ యు ది బెస్ట్ ఆఫ్ లక్. ఈ విషయంలోగాని మరే విషయంలోగాని, నా సంపూర్ణ సహాయ సహకారాలు, అండదండలు నీకుంటాయి. ఒకవేళ మీ తల్లిదండ్రులు ఒప్పుకోకపోతే డైరెక్టుగా నా దగ్గరకు వచ్చెయ్. ఏ రిజిష్ట్రాఫీసులోనో మూడుముళ్లు వేయించేస్తాను.” నవ్వుతూనే అన్నాడు రమేష్.

(ఇంకా వుంది)

పండ్లవంటి తాజాదైన స్పెన్సర్స
స్క్వాష్‌లు, సిరప్‌లు

మీ అతిథులకు వినూత్నమైన విందు ఏర్పాటుచేయండి.
స్పెన్సర్స్ స్క్వాష్‌లను, సిరప్‌లను ఆహ్వానించండి.
వారేకాక మీ కుటుంబీకులందరూ కూడా ఆశతో
ఆస్వాదించగలరు. ఎందువల్లనంటే ఇవి
విశిష్టమైన రుచితో పాటు,

తెగటించని చల్లని పానీయాలు.
ఆదాయకరమైనవి. గ్యాస్‌తో కూడిన
మరే ఇతర పానీయంకంటే వెలలు స్వల్పం.
స్పెన్సర్స్ తయారీ అంటేనే శ్రేష్ఠమైన
తయారీ అని వేరే చెప్పాలా?



శ్రేష్ఠమైనవానినే
చేకూర్చువారు

స్పెన్సర్స స్పెన్సర్ & కం. లిడ్., మద్రాసు మరియు శాఖలు

FDS SP 2166 TEL

దేశ సౌభాగ్యం కోసం ప్రభుత్వోద్యోగులు,
ప్రజలు ఏకమై పని చేయాలి.

మహాసాహసి మందుముల

ఉత్తర దేశంలో మిలాప్ ఉరుదూ పత్రిక అంటే బ్రిటిష్ ప్రభుత్వం ఎంత ఉడ్డరిల్లేదో, అప్పటి నిజాం ప్రభుత్వమూ రైయత్ ఉరుదూ పత్రిక అంటే దడదడలాడేది. లాహోర్‌లో అప్పుడు 'చలో హైదరాబాద్, ఉద్యమం ముమ్మరంగా ఉండేది. రైయత్ పత్రిక అనుదిన జపంగా ఉండేది లాహోర్ జనానికి. ఒక తెలుగువాడు అలాటి సాహసోపేతమైన పత్రికను నడుపుతున్నాడన్న కీర్తి నాబోటి సామాన్యుని వద్దకూడా ప్రసరించి, నన్ను కూడా మెచ్చుకొనేవారు. ఆ సాహసి శ్రీ మందుముల నరసింగరావు. 1896 లో హైదరాబాద్‌జిల్లా చావెళ్ల తాలూకా మందుముల గ్రామంలో జన్మించారు. తెలుగు, ఉరుదూ, హిందీ పారసీక భాషలలో పాండిత్యం సంపాదించి, 1921 లో న్యాయవాద పట్టా పుచ్చుకొని, ఐదేళ్ళు న్యాయవాదిగా పనిచేసి పత్రికా రచన దేశసేవకు ముఖ్యమని సంభావించి రైయత్ వార పత్రిక పెట్టారు. నిజాం వ్యతిరేకోద్యమానికి అండగా నిలిచారు. అది మధ్య మధ్య ఆగుతూ దినపత్రికగా మారి 1951 వరకు సేవ చేసింది. శ్రీ మందుముల వివిధ ప్రజాసంస్థలలో సభ్యులై ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం మంత్రిగా వున్నారు. 1965 లో ప్రజాజీవితం నుంచి విరమించారు. ఉరుదూ పత్రికా రచనకు కొత్త వెలుగులు తెచ్చారు ఆయన. నిజానికి బలి అయిపోయిన షోయబుల్లాఖాన్ ఆయనకు శిష్యప్రాయుడు. ఆయన ప్రోత్సాహంతోనే ఖాన్ ఇమ్‌రోజ్ పత్రిక నడిపారు. హిందూస్థాన్ సమాచార్ వార్తా సంస్థ 1974 మార్చి నెలలో రజతోత్సవం జరిపినప్పుడు ప్రముఖ భాషా పత్రిక రచయితలుగా సన్మానితులైన ముగ్గురిలో మందుముల ఒకరు. ఆయనతో పాటు తెలుగు పత్రికా రచయితగా సన్మానం పొందే అవకాశం నాకూ కలిగింది. మే నెల 12 వ తేదీ తెల్లవారు ఝామున మందుముల శాశ్వతంగా కన్ను మూయడంతో పత్రికాలోకానికి, ముఖ్యంగా ఉరుదు పత్రికా లోకానికి అపార నష్టం కలిగింది. ఆయన చివరి దశలో రచించిన హైదరాబాద్ ప్రజా జీవితం అనే గ్రంథం ముద్రిస్తే చాల అపూర్వ విషయాలు ఆంధ్రావళికి తెలుస్తాయి.

ఏకలిపి

తెలుగు, ఉరుదూ భాషలకు ఏకలిపి దేవనాగరి లిపి వాడుక చేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ వల్లూరి బసవరాజు మే 22, 23 తేదీలలో జరిగిన ఉరుదూ మహాసభలో చేసిన సూచనను లిపి శాస్త్రజ్ఞులు, భాషా శాస్త్రజ్ఞులు ఆలోచించాలి. గాంధీజి ఏకభాష, ఏకలిపి, గురించి జాతీయోద్యమంలో పాటు ప్రచారం చేశారు. ఏక భాష రాజకీయంగా సాన్నిహిత్యాన్ని, ఏకలిపి మానసికంగా సాన్నిహిత్యాన్ని సాధిస్తుందని శ్రీ రాజు


హైదరాబాద్ నోట్ బుక్

కూడా ప్రచారం చేశాడు. శ్రీ రాజు అన్నట్టు లిపిని మార్చడం వల్ల, భాషకు ఎలాటి నష్టమూ కలుగదు. మీదు మిక్కిలి పొదుపు కూడా. బ్రిటిష్ వారు వేదాలను గూడ రోమన్ లిపిలో ముద్రించారు. ఉరుదూకు రోమన్ లిపి వాడారు. రోమన్ లిపి వాడగా లేని నష్టం మన దేశంలో పుట్టి మన ప్రజలతో వ్యవహృతమై, పారసీ, అరబ్బీ సంప్రదాయాల అనుసరణ వల్ల పేరు మార్చుకున్న హిందీకి దేవనాగరి లిపి వాడటం వల్ల వచ్చే నష్టం ఏముంటుంది? కొంచెం ఉదారంగా చూడ్డి అంతే.

ఉపశ్రుతి:

“ఆ వీరేశలింగం పంతులు ఇప్పుడుంటే గొంతు పిసికి చంపే వాణ్ణి!” అన్నాడు ఒక కుటుంబ నియంత్రణ సోమయాజి. “ఎందుకు స్వామి అంత కోపం!” అని సవినయంగా మనవి చేశాను “కోపమా? తక్కువ మాటన్నావు. ఆయన బాలవితంతువులకు పునర్వివాహం అనబట్టి కదా ఇంత జనాభా పెరిగింది. బ్రహ్మ సమాజమును, సాహిత్యమును తనపాటికి తను వుండిపోతే ఏమయ్యేది? ఈ పండితులంతా ఇంతే. వట్టి అధిక ప్రసంగులు” అన్నాడు ఆయన నిప్పులు కక్కుతూ. కాలగితే ఇంత.

— తిరుమల రామచంద్ర



వీరేశలింగం సంక్షిప్త జీవిత చరిత్ర

ఏదో ఒక రంగంలో చెప్పుకోదగ్గ కృషి చేసి కీర్తికాయులైన వ్యక్తులెందరో ఉంటారు. కానీ, ఎన్నో రంగాలలో బహుముఖ ప్రజ్ఞతో కృషిచేసి తాము నమ్మిన సిద్ధాంతం కోసం సర్వస్వం త్యాగం చేసిన మహా పురుషులు చాలా అరుదుగా ఉంటారు.

అర్భకుడుగా పుట్టి, బాలారిష్ట దోషాలు పట్టి బతికి బట్టకడతాడా అనుకున్నట్టి వీరేశలింగం ఎందరి బ్రతుకులనో పూలబాటలో నడిపించడానికి డెబ్బయ్యొక్క సంవత్సరాలు బ్రతికాడు. వీధి బళ్లో చదువుతున్నప్పుడే కావ్యాలనేకం చదివాడు. తెలుగు భాషపై మక్కువ పెంచుకున్నాడు. ఏకసంధాగ్రాహి అతడు. పాఠశాలలో అన్నిటిలో ప్రథముడిగా సత్ప్రవర్తనలో సహా బహుమతులెన్నో అందుకున్నాడు. అహంకారి, అసమర్థుడు అయిన ప్రధానోపాధ్యాయుడిని బదిలీ చేయించడానికి విద్యార్థులచేత సమ్మె చేయించాడు.

ఇరవయ్యేళ్ళ ప్రాయంలోనే కవిత్వం చెప్పాలన్న కోరిక కలిగిందాయనకు. రెండు శతకాలు వ్రాశాడు. ముందెవ్వరూ చెయ్యని ప్రక్రియ చెయ్యాలన్న దీక్షతో అచ్చ తెలుగు, నిర్వచనం, నిరోష్ఠ్యం కలిపి "శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం" వ్రాసి పండితుల ప్రశంసలనందుకున్నాడు. పిల్లలకోసం వ్యాకరణం వ్రాశాడు. పూర్వ కవుల చరిత్రని వ్రాశాడు. పూర్వకవుల కావ్యాలని పరిష్కరించి ప్రకటించాడు. ఆయన వ్రాసిన గ్రంథాలు శతాధికం. అనువాదాలు, ప్రహసనాలు అనేకం.

దేశసేవ - భాషాసేవ

దేశసేవ, భాషాసేవ ఆయన రెండుకళ్ళూ. తాను పూనుకున్న సంస్కరణని ఎన్ని అవాంతరాలు వచ్చినా విడనాడలేదు. అందువల్ల ఎందరో మిత్రులతో అభిప్రాయ భేదాలు వచ్చినా చలించలేదు. ఆత్మబలంతో సమాజాన్ని ప్రభావితంచేసిన మహాత్ముడాయన. ఆనాడు సంఘంలో నెలకొని ఉన్న మూఢాచారాలని, అన్యాయాలని, అక్రమాలని నిర్భీతిగా ఎదిరించాడు. వజ్రాయుధ లాంటి 'వివేక వర్ధని' దానికి అనుబంధం హాస్య సంజీవని పత్రికల ద్వారా సంఘానికి చేరు పురుగుల్లా తయారైన వ్యక్తుల్ని, వ్యవస్థలని తూర్పార పట్టాడు. మహిళాభ్యుదయానికి, స్త్రీ విద్యకు ఆయన చేసిన సేవ అపారం. ఎన్నో కష్టనష్టాలకోర్చి వితంతు వివాహాలని జరిపించాడు. ప్రత్యేకంగా స్త్రీలకోసం 'సతీహితబోధిని' పత్రిక నడిపి, ఆడవారికీ, పిల్లలకీ ప్రయోజనకరమైన పుస్తకాలు ఎన్నో ప్రచురించాడు. స్త్రీ పునర్వివాహం శాస్త్ర సమ్మతమని ఎన్నో ప్రాంతాల్లో పర్యటించి, అనేక సభల్లో వాదించి ఒప్పించిన ధీరుడాయన. పెక్కుచోట్ల ప్రార్థనామందిరాలను, సమాజాలను స్థాపించి తన సర్వస్వాన్ని ధారపోసిన త్యాగశీలి పంతులుగారు.

రాలిన ముత్యాలు

……శ్రీ సోమసుందర్……

ఎవరో పిచ్చివాడు
ఆకాశం మీద మసిబొగ్గుతో
ఏనుగుల బొమ్మలు గీస్తున్నాడు!
అబ్బో పిచ్చివాడు గట్టివాడే—
ఏనుగులు కోపంతో ఘీంకరిస్తున్నాయి
భూలోకం దర్జీవాడి మీద
మురికినీరు చల్లుతున్నాయి...
పాపం, పిచ్చివాడి బొమ్మలు
కొట్టుకు పోతున్నాయి!

సతీమణి చేయూత

ఆయన సతీమణి రాజ్యలక్ష్మమ్మ ఉత్తమ ఇల్లాలు. ఆయనవేసిన ప్రతి అడుగు ఆమె ప్రోత్సాహ సహకారాలతోనే సాగింది. భర్త సమ్మతమే ఆమె సమ్మతం. అది వమ్ము చేయాలని బంధువు లెందరో ప్రయత్నించి విఫలులైనారు. ఆమె సహకారమే లేకపోతే తానేమీ చెయ్యలేకపోయేవాడినని వీరేశలింగంగారే తన ఆత్మకథలో పేర్కొన్నారు. అర్థాంగికి సరైన నిర్వచనం ఆమె. అందుకే తన స్వీయ చరిత్రని ఆమెకే అంకితం చేశాడాయన.

వీరేశలింగం సంక్షిప్త జీవిత చరిత్రని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధ శాఖవారు ఆయన జన్మదినోత్సవ సందర్భంగా ఏప్రిల్ 16న ప్రకటించారు. డాక్టర్ అక్కిరాజు రమాపతి రావుగారిచే ప్రత్యేకంగా దీన్ని వ్రాయించారు. ఒక మహాపురుషుని జీవితాన్ని సంగ్రహంగా రాయడం అన్నది అందరికీ చేతనయ్యే పనికాదు. అలాంటిదాన్ని డాక్టరు రమాపతిరావు ఎంతో చక్కగా, ప్రతిభావంతంగా నిర్వహించారు. 80 పేజీలలో, 8 విభాగాలతో సమగ్రంగా ఉండనిపించేలా ఆయన రాసిన ఒక్కొక్క విభాగం ఒక్కొక్క కథలా పాఠకుని ఆకట్టుకుంటుంది. చివరి పేజీలో చేర్చిన మూడు అన్న

బంధాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి మొదటి అనుబంధంలో కందుకూరి జీవితంలో ముఖ్య ఘట్టాలు, ఆయన రచనలు, ఉన్నాయి రెండవ దానిలో ఆయన మిత్రులైన కొందరి వివరాలు ఇవ్వబడ్డాయి చివరి అనుబంధంలో కీ శే స ఆర్ రెడ్డి, వీరేశలింగం మరణించినప్పుడు చేసిన సంతాప ప్రకటనలోని ముఖ్యమైన భాగాన్ని వేశారు వీరేశలింగం వక్తృత్వం ఎలాంటిదో ఈ భాగం పరిచయం చేస్తుంది పుస్తకం వెల ఎంతో ఎక్కడా ఇవ్వలేదు కారణం ఏదైనా ఆసక్తిగల వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధ శాఖ, హైదరాబాదుకు రాసి వివరాలు తెలుసుకునే వీలుంది అందరూ చదవాల్సిన పుస్తకం ఇది అన్నది మాత్రం అక్షరాలా నిజం

— మాధవ్

డాక్టరు సలహాలు

'డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

డి ఆర్ ఓరాల

నా వయస్సు 19 సం లు నా కంట క్రింద భాగము మీద నల్లని చారలు పడినవి అవి ఎలా పోవునో తెలుప ప్రార్థన

ఇటువంటి ప్రశ్న చాలామంది వ్రాయటం జరిగింది మానవునికి తగినంత ఆహారం, దానికి సరిపడ వ్యాయామం, వీటి మూలంగా ఏర్పడే అలసట మరి, కావలసినంత విశ్రాంతి భౌతికంగాను మానసికంగాను కూడా ఉండటం ప్రకృతిసిద్ధమైనదే! వీటిలో ఏది లోపించినా ముఖ్యంగా మానసిక ఆందోళన, వ్యథ, నిద్రలేమి మొదలయినవి ఏర్పడటం, తద్వారా ఏర్పడే శారీరక మార్పులలో బాహాటంగా కనుపించేది. కంటి లోని అసహజత్వమే! కంటి రెప్పలు వాయటం కళ్ళు లోతుకి పోయినట్లుండటం, నల్లనిచారల వంటి గీరలు ఏర్పడటం మొదలయినవి. వీటి వల్ల రాగల మార్పులు. వీటిని పోగొట్టాలంటే పై వాటిని గురించి శ్రద్ధవహిస్తే చాలు.

పి. జి. కె. ఏలూరు

నాకు 20 రోజుల క్రితం పాసు పోవునపుడు నొప్పి కలిగింది. తెల్లగా ఒక చుక్క చీము కూడా పడినది. దానికి పెన్సిలిన్ పెనిడ్యూర్, వాడినాను. తగ్గినట్లే తగ్గి మరల వస్తున్నది.

నీరు పోయే సమయంలో నెప్పి, చీము ఉన్న వారు, దాదాపు నూటికి 90 వంతులు "సుఖ రోగాలకి" గురి అయిఉంటారని నిర్ధారణగా చెప్ప వచ్చు.

ఈ రోగం ఉన్నా ప్రస్తుత ఆధునిక వైజ్ఞానిక యుగంలో ఉన్న క్రిమి సంహార మందుల్ని క్రమంగా వాడబడితే తప్పక గుణమవటంతథ్యం! కాని నిర్ణీత కాలంలో నిర్ణీత సంఖ్యలో వైద్య సలహా ప్రకారం క్రమపద్ధతిలో వాడవలసి ఉంటుంది. నిర్లక్ష్యం వల్ల, మూత్రద్వార బంధమేర్పడి అసలు మూత్ర విసర్జనే కష్టతరమవుతుంది!

ఎ. పి. హైదరాబాదు

నా వయస్సు 17 సం. లు నాకు రెండు నెలలుగా మలములో రక్తము పోతూన్నది. మధ్యలో ఒకసారి పడదు. గత రెండు మాసములుగా పోయినంత రక్తము ఇంతకు ముందు ఎప్పుడూపోలేదు రక్తము పోయినపుడు చాలా బాధగా వుంటుంది దయచేసి దీనికి తగిన చికిత్స తెలుప ప్రార్థన


మలంలో రక్తం పోవటం, అనేది 2, 3 ముఖ్య కారణాలపై ఆధారపడి ఉంటుంది ఒకటి "పైల్స్" (మూలశంక), రెండవది, గట్టిగా ఉన్న మలం, ఫిస్టులా పైల్స్, ఫిషర్ మొ॥ ఉండటం. దీనికి ప్రత్యక్షంగా ప్రత్యేక సాధనాలను

వాడి, పరీక్షించాల్సి ఉంటుంది దీనికై ప్రయత్నించండి

ఎస్. ఎస్. ఆర్. — లఖశాపురం

నా మూడుకు భాగము కొద్దిగా వాచినది ఆభాగమంతా మెత్తగా ఉన్నది. డాక్టరుకు చూపితే ఏదో ద్రవము చేరినది అని మందులు ఇచ్చారు ఇంజక్షను చేశారు కాని తగ్గలేదు.

మోకాలు కీలులో నీరు చేరటంవల్ల ఆ భాగం వాయటం అనే దానికి ప్రస్తుతం మీరు చికిత్స పొందిన విధానం సరిఅయినదే అని, చేతితో తీసివేసినట్లుపోదని, వయస్సునిబట్టి, రోగాన్నిబట్టి ఎంతకాలం వ్యవధి అయ్యేదీ అసలు నయమయ్యేదీ లేనిదీ తేలుతుంది. ఇంజక్షన్ల చోట చేయడం శాస్త్ర సమ్మత వైద్య విధానమే! పోతే దానితో పాటుగా అసలు అలా రావటానికి గల మూలకారణాన్ని కనుగొనే ప్రయత్నం చేయడం దానికి చికిత్స పొందడం అత్యుత్తమం. ●




సత్వర నివారణకు శక్తివంతమైన మరియు విశ్వసనీయమైన అనాసిన్ తీసుకొనండి.

బలీయమైనది! అనాసిన్ నొప్పిని త్వరితంగా తగ్గిస్తుంది ఎందువల్లనంటే ప్రపంచమంతటా డాక్టర్లు సిఫారసు చేసే బాధా నివారక పదార్థాలను అది ఎక్కువగా కలిగియున్నది.

విశ్వసనీయమైనది! అనాసిన్ డాక్టరు ఇచ్చే విశ్వసనీయమైన ప్రిస్క్రిప్షన్ లాగా ఒక మందుల మిశ్రమం. అందువల్లనే లక్షలాది ప్రజలు అనాసిన్‌ను తీసుకొంటారు మరియు సిఫారసు చేస్తారు.

జలుబులు మరియు ఫ్లూ, తలనొప్పి, నడుము నొప్పి, కండరాల నొప్పి మరియు పంటి నొప్పికి బాగా పనిచేస్తుంది.



శక్తివంతమైన మరియు విశ్వసనీయమైన
అనాసిన్

భారతదేశపు ఎక్కువ జనప్రియమైన నొప్పి నివారిణి.

Regd. User of TM. Geoffrey Manners & Co., Ltd.   9/2/5-76

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!



హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును. వరిబీజము(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండా రండి.

డా॥ దేవర, ఫోన్: 551,
మార్వాడి గుడి వద్ద, తెనాలి.
బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

ఫోన్ : 72116   స్థాపితం : 1972



మా కల్పతరు గ్రూపులో సభ్యులుగా చేరి 20 నెలలు మాత్రము సొమ్ము చెల్లించి 50 నెలలు క్రమంగా బహుమతులు పొందండి.

వివరములకు :

మహేంద్ర ఫైనాన్షియల్ కార్పొరేషన్
హెచ్.ఓ. పాతశివాలయం ఎదుట, విజయవాడ-1
బ్రాంచి ఆఫీసులు : ఏలూరు, భీమవరం, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణం

మీకు సంతానం లేదా?



ఆపరేషన్, యితర వైద్య చికిత్సలచే నిరాశ చెందిన సోదరీమణు లనేకులు మా సలహాలచే సంతానవంతులయి యిచ్చిన యోగ్యతా పత్రములు గలవు. స్త్రీ, పురుష వంధ్యాదోష నివారణ నిపుణులం.

ఉచిత వివరములకు
శ్రీ నాగార్జున మూలిక కుటీరం
రైల్వేస్టేషన్ వద్ద, గానాలయం వీధి,
తెనాలి 2.


రుచికరమైన, పుష్టికరమైన
బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు
B
R
I
T
A
N
N
I
A
Glaxo
BISCUITS
BRITANNIA
Glaxo
BISCUITS
వెరిగే పాపాయిలకు
రుచివంతమైన తోడు
బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు మరీ అంత ప్రత్యేకమైన రుచి గలిగి ఉండటానికి ఏమిటి కారణం? వాటిలో గల సమృద్ధినిచ్చే, సంపూర్ణమైన పుష్టినిచ్చే లక్షణాలే. పిల్లలకు యివి యిష్టం, పెరుగుతారు ఎంతో బాగా వాటితో. బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు ఎదిగే మీ పిల్లలకు ఎంతో మంచివి.
బ్రిటానియా
బిస్కట్లు అత్యుత్తమమైనవి
లింటాస్-BBC.GLX-6-140 TL

అవీ - ఇవీ - అన్నీ

కోర్బా ఆంధ్ర సమితి

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అంగ్యావినియం నగరంగా పేరు పొందిన కోర్బాలో ఆంధ్రకళా సమితివారు ఏప్రిల్ 24 వ తేదీన డి. వై. సంపత్కుమార్ (గీతా కళా మందిర్, విజయనగరం) నృత్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వచ్చిన సుమారు 3 వేల మంది ప్రేక్షకులను సంపత్కుమార్ బృందం వారి జాలరి నృత్యం, విష్ణువ శంఖం, శ్రీమతి ఉషా సంపత్కుమార్ తరంగ నృత్యం బాగా ఆకట్టుకున్నాయి. (ఒ. వి.)



అందుకున్న స్వర్గం

నవల. రచన: కోమలాదేవి. ప్రచురణ యం. శేషాచలం అండ్ కంపెనీ మచిలీపట్నం, సికింద్రాబాదు. మద్రాసు, 224 పేజీలు. వెల రు.7.50 ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతి రోడ్డు, సికింద్రాబాదు.

వివాహం అయిన లత తొలినాడే భర్యగా తన స్థానం ఎలాంటిదో తెలుసుకుని హతాశురాలవుతుంది. కాని ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో భర్తలో తొగ తెంపులు చేసుకుంటుంది. కొందరికది కోపకారణమైనా, ఆత్మీయులామెనభినందిస్తారు. ఒకసారి పెళ్ళయి కన్యగానే ఉన్నా, ఆ వివాహం విధివశాత్తు రద్దయినా ఆ స్త్రీ జీవితంలో తలయెత్తె సమస్య లని చక్కగా చిత్రీకరించారు. అన్నాచెల్లెళ్ళ అనుబంధలు, ఆత్మీయుల ఆప్యాయతలు, స్నేహంతోని సంస్కారంతో కూడినమనుతాభిమానాలు ఈ నవల లోని కొన్ని పాత్రలు పాఠకులకి పంచిపెడ్తాయి. యూరప్ పర్యటనానుభూతితో కథ సుఖాంతమవుతుంది. (ఎం. ఆర్.)

విజయవాడలో కళాదర్శిని

అన్నివర్గాల వారికీ నృత్యకళని అందుబాటులోకి తేవాలన్న ఆశయంతో అభ్యుదయ భావాలుగల శ్రీమతి జమునా నరసింహం దర్శకురాలిగా 'కళాదర్శిని' నృత్య పాఠశాలకి ఏప్రిల్ 25న రైల్వే ఇన్స్టిట్యూట్‌లో ప్రారంభోత్సవం జరిగింది. ఈ సభకి ప్రధాన అతిధిగా పోలీసు అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీ స్వరన్‌జిత్‌సేన్ వచ్చారు. శ్రీమతి అనితాసేన్ కళాదర్శిని కి ప్రారంభోత్సవం చేశారు అనంతరం శ్రీమతిజమునానరసింహంఅండ్‌పార్టీవారిచే రెండుగంటలసేపుకూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శన ప్రేక్షక జనరంజకంగా జరిగింది. (ఒ. వి.)


విశ్వకర్మ జయంతి

విశ్వబ్రాహ్మణ యువజన సంఘం వారిచే కృష్ణాజిల్లా నిడమానూరులో మే 1 న విశ్వకర్మ జయంతి ఉత్సవాలు జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రంవరకూ విశ్వకర్మ పూజన కార్యక్రమాలు జరిగాయి. ఆనాటి రాత్రి శ్రీ వై. మాధవాచారి అధ్యక్షతన సమావేశం జరిగింది. విశ్వకర్మ జయంతి నిర్వాహకుల తరపున శ్రీ సి. హెచ్. రాఘవాచారి, శ్రీ డి. రామాచారికి సన్మానం చేశారు. సన్మానపత్రాన్ని శ్రీ ఎల్. నాగభూషణాచారి చదివారు. డాక్టర్ వి. ఎల్. నరసింహారావు, డాక్టర్ పి.వీరబ్రహ్మాచార్య, శ్రీ పి. నాగేశ్వరరావు, శ్రీ కె. వెంకటసుబ్బారావు మొదలగువారు సమావేశంలో పాల్గొన్నారు. డాక్టర్ సి. హెచ్. సుబ్రహ్మణ్యం వందన సమర్పణ చేశారు. ఈ జయంతి ఉత్సవాల జమాఖర్చులని శ్రీపి. హెచ్. సోమశేఖరరావు వివరించారు. (ఒ. వి.)

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street,



మీ బాబుకు
రాశిఫలం సూచనలు
ఏ విధంగా వున్నాయి?
మరెక్కువ
గ్లాక్సో ఇన్‌ఫేంట్
మిల్క్ ఫుడ్స్
తీసుకోవాలని
చెప్తున్నాయి!
మీ బాబుకు ప్రస్తుతకాలం చాలా అనుకూలంగా వుంటుంది. గ్లాక్సో ఇన్‌ఫేంట్ మిల్క్ ఫుడ్స్ మీ ఇంటిలో వుంచుకోండి మరియు మీ బాబును హాయిగా మరియు ఆరోగ్యంగా వుంచండి.
మీ బాబు యొక్క ఆరోగ్యం చాలా బాగా వుంటుంది. మంచి దృఢంగా, చురుకుగా వుంటాడు. ఈ పుష్టిగల గ్లాక్సో ఇన్‌ఫేంట్ మిల్క్ ఫుడ్స్‌తో బాబు నేత్రాలు చాలా తేజోవంతగాను, ఎముకలు చాల దృఢంగాను వుంటాయి. ప్రేమ, చిరునవ్వులతో చిందులు త్రొక్కుతూ వుంటాడు. ఊదా మరియు నీలిరంగు బట్టలు మీ బాబుకు వేయండి.
అదృష్టానికి గ్లాక్సో సన్‌షైన్ లేక ఓస్టర్‌మిల్క్ డబ్బా వుంచుకోండి—ఇవి తయారుగా లభిస్తాయి-అనువుగా.
గ్లాక్సో ఇన్‌ఫేంట్ మిల్క్ ఫుడ్స్‌లో విటమిన్ 'డి' సమృద్ధిగా వుండుటవల్లే, రికెట్స్ మరియు దంత జబ్బులు రాకుండా కాపాడుతోంది. ఇవి శరీరం దృఢంగా, ఎముకలు తిన్నగా, మంచి పళ్ళు, శరీర ఛాయ చక్కగా వుండడానికి వుపకరిస్తోంది.
SUNSHINE
Glaxo
OSTERMILK
గ్లాక్సో ఇన్‌ఫేంట్ మిల్క్ ఫుడ్స్
Interpub/GL/7/76 TEL



రంజిత్‌కుమార్ సమర్పించు
ఆర్.కె. ఆర్ట్ ప్రొడక్షన్స్
మనవూరి కథ
ఈస్ట్‌మన్ కలర్
దర్శకత్వం: కె. హేమాంబరధరరావు
కథ: పాలగుమ్మి పద్మరాజు మాటలు: గోపి సంగీతం: జె.వి. రాఘవులు
లక్ష్మీ ఫిలింస్
LAKSHMI PUBS